J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 03.07.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 05 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



## • రాజన్న సాక్షిగా రాష్ట్రంలో...

# పథకాల పండుగ








**ఆంధ్ర రాష్ట్రంలో జులై 1వతేదీ నుండే పండుగ వాతావరణం వచ్చేసింది. సాధారణంగా తొలి ఏకాదశి నుండి వరుసపెట్టి పండుగలొస్తాయి అదే క్రమంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడా జులై ఒకటోతేదీ నుండి రాష్ట్రంలో పథకాల పండుగ చేస్తోంది. జగన్ అధికారంలోకి రాకముందునుండీ ఒకేమాట చెప్తూ వచ్చాడు... తాను అధికారంలోకి వచ్చినతరువాత రాష్ట్రంలో రాజన్న రాజ్యం తెస్తాను, తన నాన్న ఫోటో పక్కనే ప్రతీ ఇంట్లో తన ఫోటో కూడా పెట్టుకునేలా పరిపాలన సాగిస్తాను అని అన్నాడు. ఇప్పుడు ఇది అక్షరాలా అమలు చేస్తున్నాడు. ఆ రంగం ఈ రంగం అని లేకుండా ప్రతీ చోట తన ముద్ర ఉండేలా పథకాలకు రూపకల్పన చేసి ప్రజలకు అందిస్తున్నాడు.**

తమ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంగా రాబోయే రోజుల్లో చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాల ప్రణాళికను రూపొందించుకుని 2020 మే నెల నుండి 2021 మార్చి వరకు ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను జగన్ విడుదల చేసి ఒక్కొక్కటిగా చెప్పినవి చెప్పినట్లుగా చేసుకుంటూ వస్తున్నాడు. ప్రజలకు తనేం చెప్పాడో ఏం చెయ్యబోతున్నాడో స్పష్టంగా చెప్పేవిధంగా ఈ క్యాలెండర్‌ను రూపొందించి అమలు చేస్తున్నాడు.

### ఆయన ఆలోచనలను ఆశయాలను ఒకసారి పరిశీలిస్తే...

మే 30న రైతు భరోసా కేంద్రాలు, జూన్ 4న వైఎస్ఆర్ వాహన మిత్రల ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం, జూన్ 10న నాయీబ్రాహ్మణులు, రజకులు, టైలర్‌లకు రూ.10 వేల ఆర్థిక సాయం, జూన్ 17న వైఎస్సార్ నేతన్న నేస్తం పేరిట ఆర్థిక సాయం, జూన్ 24న వైఎస్సార్ కాపు నేస్తం అమలు, జులై 1న 1088 కొత్త 108, 104 అంబులెన్సులు ప్రారంభం.

### ఈరోజు నుండి నిరుద్యోగుల కోసం ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్...

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ సిబ్బందితో కలిసి వారితో సమాన హక్కులతో పని చేసేందుకు అవసరాలకు తగ్గట్టు అన్ని విభాగాలలో కొంతమంది సిబ్బందిని ఔట్ సోర్స్ చేయడం అనేక సందర్భాలలో జరుగుతుంటుంది. అయితే నిరుద్యోగుల మానసిక స్థితిని ఆసరాగా చేసుకుని ఈ పోస్ట్‌లలో చేర్చేందుకు కూడా దళారులు పుట్టుకొచ్చి వాళ్ళ దగ్గర కూడా డబ్బులు తీసుకోవడమే కాకుండా నెల నెలా వాళ్ళకొచ్చే జీతాలలో కూడా కమిషన్ పొందే వ్యవహారాలు ఇప్పటివరకు జరుగుతూ వచ్చాయి. వీటి కోసం

(మిగతా 11వ పేజీలో)



## భావితరాలకు స్ఫూర్తి.. మన...

# పాములపర్తి

12లో

## • కరోనా పట్ల...

# అలక్ష్యం వద్దు

- ప్రధాని మోడీ



11లో

# శాసనసభాపతి కాసేపు ఆగి.. వెళ్లాడు



బుధవారం విజయవాడనుండి నెల్లూరుమీదుగా తిరుమలకు వెళ్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం మార్గమధ్యంలో నెల్లూరులో కాసేపు ఆగి వెళ్ళారు. జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు, ఎస్.పి భాస్కర్‌భూషణ్‌లతో పాటు జలవనరుల మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, సర్వేపల్లి, ఉదయగిరి, గూడూరు శాసన సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వరప్రసాద్‌లు ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఆయనను కలుసుకుని మాట మంతి కలిపారు.

# ప్రభుత్వోద్యోగుల బదిలీలు

నెల్లూరులోని సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకుల కార్యాలయంలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న అయిదుగురు ఉద్యోగులను బదిలీచేస్తూ ఆ శాఖ డిప్యూటిడైరెక్టర్ జీవపుత్ర కుమార్ గతనెల 29న ఉత్తర్వులు జారీచేశారు. ఈ అయిదుగురిపై పలు ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు ఆదేశాల మేరకు జేసీ విచారణ జరిపి నివేదిక అందజేశారు. కలెక్టర్ ఆదేశాలతో వారిని జిల్లాలోని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. డిడి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మధును బోగోలుకు, నిరంజన్‌ను కండలేరుకు, సుధాకర్‌ను బుచ్చికి, గౌస్‌ను ఆదూరుపల్లికి, అటెండర్ జాలాది శ్రీనివాసులును నాయుడుపేటలోని ఎస్‌సి గురుకుల పాఠశాలకు బదిలీ చేశారు.

## తహశీల్దార్ల బదిలీ :

జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న పలువురు తహశీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు గతనెల 29న ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న పద్మావతిని వాకాడు తహశీల్దారుగా, వాకాడు తహశీల్దార్ రాజ్యలక్ష్మిని ఐటిడిఏకి, ఐటిడిఏలో పనిచేస్తున్న కృష్ణారావును కెఆర్సీకి బదిలీ చేశారు. వరికుంటపాడు తహశీల్దారు హమీద్‌ను నియమించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం సిసి ఎం.మధుసూదన్ రావు, సంగం తహశీల్దార్ కెవి రమణయ్య, గూడూరు డిఏఓ ఏ.శ్రీనివాసరావు, కలెక్టరేట్ తహశీల్దార్ సి.ఉష, కోట తహశీల్దార్ మల్లికార్జున ఉద్యోగవిరమణతో మండల తహశీల్దార్ల స్థానంలో డిటిలకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీచేశారు.

# చందనాలంకారంలో.. లక్ష్మీనృసింహుడు

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గత నెల 30న స్వామివారి మూలమూర్తికి అత్యంత శోభాయమానంగా చందనాలంకారం నిర్వహించారు. వేకువన 4 గంటలకు పాలు, తేనె, పసుపు, పెరుగు, చందనం, కొబ్బరినీళ్ళు, పంచదార, నెయ్యి, పలు రకాల పండ్లరసాలతో స్వామివారికి ఎంతో భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. స్వాతి నక్షత్రం కావడంతో స్వామివారికి శాస్త్రోక్తంగా శాంతిహోమాన్ని నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ఎంతో వేడుకగా స్వామివారికి, అమ్మవార్లకు కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య, దేవస్థానం ప్రధాన అర్చకుడు సీతారామయ్యస్వామి, అర్చకులు శశిస్వామి, బాలాజీస్వామి పాల్గొన్నారు.

## పాడి రైతుల శ్రేయస్సుకే విజయా డెయిరీ

**- చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి**

జిల్లాలోని పాడి రైతుల శ్రేయస్సుకు విజయా డెయిరీ ఎప్పుడూ ముందుంటుం దని డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి అన్నారు. జిల్లాలో కరువు పరిస్థితులు, కరోనాతో నష్టపోయిన పాడి రైతులను ఆదుకునేందుకు ప్రస్తుతం ఇస్తున్న ధర పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు గతనెల 30 న ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. పాడి రైతులకు గిట్టుబాటు ధర గేదె పాలకు కేజీ వెన్నకు రూ.555, రూ.15 కమీషన్‌గా రూ.570లు ప్రస్తుతం చెల్లిస్తున్నామని, ఈ నెల 1 నుండి గేదె పాలకు కేజీ వెన్నకు రూ.575, రూ.15 కమీషన్‌తో కలిపి రూ. 590లకు పాల సేకరణ ధరలు పెంచినట్లు తెలిపారు. దీంతో పాడి రైతులకు లీటరుకు రూ.2లు ధర పెరుగుతుందన్నారు. పాల అమ్మకాల ధరల్లో ఎటువంటి మార్పు లేదన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

**- డిపిఓ ధనలక్ష్మి**

కరోనా మహమ్మారి వ్యాధి నేపథ్యంలో జిల్లాలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలని, ఎంపిక చేసిన గ్రామాల్లో జరుగుతున్న 'మనం-మన పరిశుభ్రత' పథకాన్ని జిల్లాలోని అన్ని పంచాయతీల్లో అమలుచేయాలని జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. గతనెల 27న నెల్లూరు నగరంలోని తమ కార్యాలయంలో ఆమె డిఎల్‌పిఓలు, ఈఓ పిఆర్‌డిలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ సచివాలయాల్లో సమయపాలన ఉండేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని అన్ని సచివాలయాల ద్వారా సకాలంలో ప్రజలకు సేవలందించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఏ మాత్రం అలసత్వం వహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. వీధి దీపాల సమస్యల పరిష్కారానికి ఒక ఆపరేటర్‌ను, హెల్పర్‌ను ఏర్పాటు చేశామన్నారు. సచివాలయాల్లో సంక్షేమ పథకాల లబ్ది దారుల జాబితాతో పాటు వలంటీర్లు, సిబ్బంది ఫోన్ నంబర్లను కూడా ప్రదర్శించాలని ఆమె ఆదేశించారు.

# భూపందేరానికి రంగం సిద్ధం

## • 30 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీకి రెడీ



రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఇల్లు ఉండాలన్న ఆలోచనతో మహానేత దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని జూలై 8న ఒకే రోజు 30 లక్షల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించనున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. ఈనెల 1వతేదీ నెల్లూరు నగరంలోని మన్సూర్ నగర్, ఖుద్దూస్ నగర్, బారకాసు, వహాబ్ పేట ప్రాంతాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో ఎవరికైనా స్థలం రాకుంటే 90రోజుల కాలవ్యవధిలో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, కాపు నేస్తంలో జూలై 24లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం మంత్రి నగరంలోని రామలింగాపురం సెంటర్‌లో నిర్మించనున్న వంతెనను 10 రోజుల్లో ప్రారంభించి ఏడాదిలోగా పూర్తి చేస్తామన్నారు. రూ.90కోట్లతో సర్వేపల్లి కాలువ, రూ.40 కోట్లతో వంతెన, రూ.45 కోట్లతో సిసి పనులు, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.45 కోట్లతో పనులు మొదలవుతున్నాయన్నారు. వైయస్సార్‌సీపీ నాయకులు రూప్‌కుమార్‌యాదవ్, చాట్ల నరశింహారావు, గోగుల నాగరాజు, ఎండీ ఖలీల్ అహ్మద్, ఎస్‌ఆర్ ఇంతియాజ్, సిద్దిక్ పాల్గొన్నారు.

# కామర్స్ గ్రూప్‌లోకి 'విశ్వసాయి'

## ఎం.ఇ.సి, సి.ఏ ఫౌండేషన్ కోర్సులు ప్రారంభం

ఇప్పటి వరకు సైన్స్ గ్రూపులో విద్యార్థుల ఆశయాలను, తల్లిదండ్రుల ఆశలను నిజం చేస్తూ ఎంతోమంది విద్యార్థులను డాక్టర్లుగా, ఇంజనీర్లుగా తీర్చిదిద్దిన విశ్వసాయి జూనియర్ కళాశాల అదే స్ఫూర్తితో ఈ సంవత్సరం నుండి కామర్స్ గ్రూపులోకి అడుగుపెట్టబోతోంది.

ఈ నెల 1వ తేదీ చార్టర్డ్ అకౌంట్స్ డేని పురస్కరించుకుని నెల్లూరులోని విశ్వసాయి కళాశాలలో సిఏ డేని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు డా. ఎన్.సత్యనారాయణ, జి.కృష్ణమోహన్‌లు మాట్లాడుతూ తల్లిదండ్రులు, విద్యార్థుల కోరిక మేరకు ఈ విద్యాసంవత్సరం నుండి సైన్స్ గ్రూపుతో పాటు కామర్స్ గ్రూపులోకి అడుగుపెడుతున్నట్లు తెలిపారు. విశేష అనుభవం గల అధ్యాపక బృందంతో చక్కని శిక్షణనిచ్చి ఇంటర్మీడియట్‌లో ఎం.ఇ.సి గ్రూపుతో పాటుగా సి.ఏ ఫౌండేషన్‌లో కూడా మంచి ఫలితాల సాధనకు కృషి చేస్తామని తెలియజేశారు. ఎం.ఇ.సి విద్యార్థులకు కూడా తాము అవలంభిస్తున్న 'ఫైవ్ స్టెప్' ప్రోగ్రామ్‌ను వర్తింపజేస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపల్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

నెల్లూరులోని పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు గతనెల 29న తనిఖీలు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో అధిక ధరలకు విక్రయాలు సాగించే అవకాశాలు ఉండడంతో ఇంటర్నల్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. దుకాణాల్లో ఎరువుల నిల్వ, ధరలను పరిశీలించారు. అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ అధికారిణి జ్యోత్స్న రాణి, కావలి ఏడీఏ కన్నయ్య పాల్గొన్నారు.




శ్రద్ధాంజలి

పూజ్యులు, మా ఇంటి దైవం

శ్రీమతి కాకుటూరు బుజ్జమ్మ గారు

(కీ॥శే॥ కాకుటూరు రామిరెడ్డి గారి సతీమణి)

అల్లూరు.

తేది 23-06-2020 మంగళవారం కైలాసప్రాప్తి పొందారు.

వారి ఆత్మ శాంతికై భగవంతుని ప్రార్థిస్తూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

కుమారులు - కోడళ్లు : కాకుటూరు వెంకట రమణారెడ్డి - కీ॥శే॥ మీనాక్షి

కీ॥శే॥ కాకుటూరు భక్తవత్సలరెడ్డి - సరళ

కుమార్తెలు - అల్లుళ్లు : సుభద్ర - రామవీరసాయి

రజని - పి.శ్రీనివాసరెడ్డి

మనుమడు : జయదేవసాయి మనుమరాండ్రు : రాగమాలిక, సుచిత్ర, శిల్ప, స్మిత, పవిత్ర


# నరేంద్రబాబుకు ప్రశంసలు

జాతీయస్థాయిలో జర్నలిజం అంశంపై ఆన్‌లైన్‌లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో గుండాల నరేంద్రబాబు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఇటీవల ఉయ్యూరు అదుసుమిల్లి గోపాలకృష్ణయ్య అండ్ షుగర్స్ కేన్ గ్రోవర్స్, సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ సౌజన్యంతో జాతీయస్థాయిలో జర్నలిజం అంశంపై ఆన్‌లైన్‌లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో నెల్లూరు బీవీ నగర్ కెవెన్ ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు గుండాల నరేంద్రబాబు పాల్గొని 76 శాతం మార్కులు సాధించి ఆ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య డి.బాలకృష్ణ, జర్నలిజం కన్వీనర్ ఎం.ఎల్.ఎస్.కుమారి చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

## 'పబ్లిసిటీ' బుల్లోడు...

# ర(చ్చ)ఘురామ కృష్ణరాజు



**సినిమాలలోలాగే రాజకీయాలలో కూడా హీరోలుంటారు, విలన్లు వుంటారు, కమెడియన్లు జూనియర్ ఆర్టిస్టులు కూడా వుంటారు. వారి సమర్థత సామర్థ్యాన్నిబట్టి వారి భవిష్యత్ ఎదుగుదల ఉంటుంది. అలాంటి రాజకీయ నాయకులని మనం చాలా మందిని చూశాం.**

ఉదాహరణకు... కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిత్యం వార్తలలో వుంటూ ఒకానొక సందర్భంలో ముఖ్యమంత్రి స్థానంలో వున్న దివంగత నేత రాజశేఖర రెడ్డిని సైతం విమర్శించి ఆ తరువాత కాలంలో సర్వేలంటూ జోస్యాలంటూ హడావుడిచేసిన విజయవాడకు చెందిన ఒక పార్లమెంటు సభ్యుడు ఈ రోజు ఎక్కడున్నాడో కూడా తెలియదు. రాజకీయాలలో కాదుకదా కనీసం వార్తలలో కూడా లేదు.

ఇక మనం ఎవరినైనా తిట్టినా ఎవరన్నా మనల్ని తిట్టినా మనం నిత్యం వార్తలలో ఉండడమే ప్రధానమని చెప్పడమేకాకుండా తాను ఎక్కడ ఏ కార్యక్రమానికి హాజరైనా హడావుడి సృష్టించిన నెల్లూరుకు చెందిన మరో దివంగత ఎమ్మెల్యేని ఇప్పుడు నెల్లూరోళ్లు దాదాపుగా మర్చిపోయారు. ఇలా అర్థం పరమార్థం లేకుండా పబ్లిసిటీ కోసం రాద్ధాంతం చేసే నాయకులు రాజకీయాలలో చాలామంది కమెడియన్లుగా మిగిలిపోతారు.

కొంతమందికి వార్తలు తెలుసుకోవడం అంటే ఇష్టం, మరికొంతమందికి వార్తలలో ఉండడమంటే ఇష్టం. ఆ రెండవ కోవకు చెందిన వాడే భీమవరం బుల్లోడు, నరసాపురం పార్లమెంటు సభ్యుడు రఘురామకృష్ణరాజు. సాధారణ స్థాయి నుండి అసాధారణ స్థాయికి ఎదిగిన రాజుకి కొంచం పబ్లిసిటీ పిచ్చి ఎక్కువగానే వున్నట్లుంది. తాను ఎప్పుడూ వార్తల్లోనే ఉండాలనే అత్యుత్సాహమే గతంలో అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితకు కోపం తెప్పించి ఆయనను కష్టాలలో పడేసిందికూడా. పొగడడమో తిట్టడమో ఏదోఒకటి చేసి ఎప్పుడూ వార్తలలో ఉండాలన్నదే ఆయన నైజం. పనిలేక పోయినా ప్రధాని అప్పాయింట్‌మెంట్ తీసుకుంటాడు, అవసరంలేక పోయినా అంబానీతో భేటీ అవుతాడు. నిత్యం రాష్ట్ర స్థాయిలో లేదా దేశస్థాయిలో ఎవరో ఒక రాజకీయ ప్రముఖుడినో సినీ ప్రముఖుడినో లేక క్రీడా ప్రముఖుడినో కలుస్తూనే ఉంటాడు.

ఇలా ఎదగాలన్నా, అందరినీ కలవగలగాలన్నా, స్నేహ బాంధవ్యంతో మెదిలి ఆత్మీయులను పొందాలన్నా కూడా చాలా నేర్పరితనం, కలుపుగోలుతనం ఎదుటివారిని ఆకర్షించగలిగిన వాక్ చాతుర్యం ఉండాలి. ఆ లక్షణాలన్నీ రఘురామకృష్ణరాజుకి పుష్కలంగా వున్నాయి. ఆ లక్షణాలే ఆయనను కోటీశ్వరుడిని చేశాయి, ఆ తత్వమే ఆయనను నరసాపురం పార్లమెంటు సభ్యుడిని చేసింది. ఇప్పుడు ఇంక ఆయనకి పదవి అక్కర్లేదు, పబ్లిసిటీ కావాలి. ఒక్క ఆంధ్రదేశంలోనే కాకుండా దేశ స్థాయిలో ఆయనకు గుర్తింపు రావాలి. ఆ ప్రయత్నంలో భాగమే సొంత పార్టీపై తిరుగుబాటు.

పక్కరాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం అభినందించి అవలంబిస్తున్న జగన్ విధానాలను ప్రజలకు ఆయన అందిస్తున్న పథకాలను అంతర్జాతీయ మీడియా సైతం కీర్తిస్తున్న తరుణంలో జగన్ కోటరీని విమర్శించి వార్తలకెక్కాడు రఘురామకృష్ణరాజు. జగన్ లాంటి మంచి వ్యక్తిని నేను చూడలేదంటాడు, ఆయన ఆశీస్సులు ఇమేజ్ తోనే తాను గెలిచానంటాడు, ఇలాంటి నాయకుడిని ఇప్పటివరకు తాను చూడలేదంటాడు, సమర్థవంతమైన నాయకత్వానికి ప్రతీక మా జగన్మోహన్‌రెడ్డి అని స్తుతిస్తాడు.

అదే నోటితో జగన్ వేరొకరిచేతిలో కీలుబొమ్మ అంటాడు, జగన్ విధానాలు రాజ్యాంగ విరుద్ధం అంటాడు, జగన్ పాలసీలు బాగా లేవు అంటాడు. తాను వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలవలేదు 'యువజన శ్రామిక రైతు కాంగ్రెస్' పార్టీ నుండి గెలిచానంటున్నాడు. ఇదొక్క ఉదాహరణ చాలు ఆయన రఘురామకృష్ణరాజు కాదు... రచ్చ రామకృష్ణ రాజు అని చెప్పడానికి. రఘు, రామ, కృష్ణ, రాజు.. ఇలా ఆయన ఒక్క పేరులో నాలుగు పేర్లున్నట్లుగా ఆయన నోట్లో కూడా నాలుగు నాలుకలు వున్నట్లున్నాయి. ఇలాంటి వారి రాజకీయ భవిష్యత్తు ఎలా ఉండబోతోందోననడానికి పైనపేర్కొన్న ఉదాహరణలు చాలు.

# త్రిమూర్తులకు పార్టీ బాధ్యతలు



**వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావం నుండీ పార్టీ కోసం కఠోరశ్రమ చేస్తూ.. పార్టీ పటిష్టతకు మూల స్థంబాలుగా వ్యవహరించిన త్రిమూర్తులు వై.వి. సుబ్బారెడ్డి, వేణుంబాక విజయసాయిరెడ్డి, సజ్జల రామ కృష్ణారెడ్డిలకు ముఖ్యమంత్రి జగన్ కీలకబాధ్యతలు అప్పజెప్పారు. పార్టీ మూలస్థంభం జగన్ నిత్యం ప్రజల్లో వుంటూ వారి కష్టాలు తెలుసుకుంటున్న తరుణంలో పార్టీ బాధ్యతలను ఈ ముగ్గురూ తమ భుజస్కందాలపై మోశారు. పార్టీ అఖండ విజయాన్ని సొంతం చేసుకోవడంలో తమవంతు శ్రమించారు.**

వై.వి.సుబ్బారెడ్డి ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానాల ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా ఉండగా, సజ్జల రామకృష్ణారెడ్డి ప్రభుత్వ సలహాదారుగా, విజయసాయిరెడ్డి రాజ్యసభ్యుడిగా వున్నారు. ఇప్పుడు జగన్ ఈ ముగ్గురికీ కీలక పార్టీ బాధ్యతలు అప్పజెప్పారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తైనప్పటికీ పార్టీలో అక్కడక్కడా వున్న చిన్న చిన్న వర్గ వివాదాలు, అసంతృప్తులు క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించి పార్టీని ఒక్కతాటిపై నడిపించాలన్నది జగన్ లక్ష్యం.

ఈ క్రమంలో రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించి, ఒక్కొక్క జోన్‌కి ఒక్కొరిని ఇన్‌ఛార్జిగా నియమించారు. నెల్లూరు, ప్రకాశం, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల పార్టీ వ్యవహారాలను సజ్జల రామకృష్ణారెడ్డికి అప్పజెప్పారు. కృష్ణా, గుంటూరు, చిత్తూరుతో పాటు ఉభయ గోదావరి జిల్లాల వ్యవహారాలను వై.వి.సుబ్బారెడ్డి చూస్తారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ పట్నం బాధ్యతలు విజయసాయిరెడ్డివి. ఇలా జిల్లాలవారీగా పార్టీని సమీక్షించి, మరింత బలోపేతంచేసే బాధ్యత ఈ ముగ్గురిదే.

తాడేపల్లిలో కేంద్ర కార్యాలయం భాధ్యతలను కూడా సజ్జలకు అప్పజెప్తూ, పార్టీ అనుబంధ సంస్థల వ్యవహారాలను విజయ సాయిరెడ్డిని చూడవలసిందిగా జగన్ కోరినట్లు సమాచారం. మూలస్థంభానికి తోడుగా ఈ మూడు స్థంబాలు సమర్థవంతంగా పనిచేసి, 30 సంవత్సరాలు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి, తెలుగు వారి గుండెలలో పదిలమైన స్థానం సంపాదించాలన్న జగన్మోహన్‌రెడ్డి ఆశయానికి ఊపిరిపోయాల్సిన బాధ్యత, భారం వీరిదే.

# ఈ ఇద్దరూ రాజీనామా చేశారు



**విశ్వసనీయతకు, విధేయతకు మారు పేరుగా దివంగత నేత కాలం చేసినరోజు నుండి ఆయన కుమారుడు జగన్‌కి అండగా నిలిచిన ఎంతోమందిలో అత్యంత కీలక వ్యక్తులు పిల్లి సుభాష్‌చంద్ర బోస్, మోపిదేవి వెంకటరమణలు.**



జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా వారిద్దరికీ అదే ప్రాధాన్యతనిచ్చాడు. ఇద్దరికి యంఎల్‌సీలు ఇచ్చి మంత్రులను కూడా చేశారు. అయితే అనూహ్యంగా మండలిని రద్దు చేయాల్సిన పరిస్థితులలో, అదే సమయంలో వచ్చిన అవకాశాన్ని జగన్ చక్కగా వినియోగించుకున్నారు. తన అనుయాయులిద్దరికి రాజ్యసభ సభ్యత్వాలని కానుకగా ఇచ్చి ఢిల్లీకి పంపించాడు. నమ్మిన వారిని అక్కున చేర్చుకోవడంలో జగన్ తండ్రి అలవాట్లను పుణికి పుచ్చుకున్నాడన దానికి ఇదొక పెద్ద ఉదాహరణ.

మంత్రులిద్దరూ రాజ్యసభకు ఎంపిక కావడంతో ఇప్పుడు మంత్రి పదవులకు వాటితోపాటు శాసన మండలి సభ్యత్వాలకు రాజీనామా చేసేశారు. మండలి రద్దుకు ఇంకా సమయం ఉండడంతో మరో ఇద్దరిని మండలికి పంపే అవకాశం జగన్‌కి వచ్చింది. అలాగే రెండు మంత్రి పదవులు కూడా ఖాళీ అయ్యాయి. ఆ రెండూ ఎవరిని వరిస్తాయన్నది ఇప్పుడు రాజకీయ వర్గాలలో జరుగుతున్న పెద్ద చర్చ. కేవలం ఆ రెండూ భర్తీ చేస్తాడా లేక ఇంకెవరినైనా కూడా ఇంటికి పంపిస్తాడా, ప్రస్తుత మంత్రులు శాఖలను ఏమైనా మారుస్తాడా? అన్నది ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఆంధ్రా పాలిటిక్స్.

# జంకు లేని జనం



**20 రోజుల కఠిన లాక్‌డౌన్ పెట్టాలి**
**రోడ్లపై కనిపిస్తే క్వారెంటైన్‌కి పంపాలి**
**- మేధావుల విజ్ఞప్తి**

**ఒక 20 రోజులు కఠిన లాక్‌డౌన్ పెట్టాలి, నిబంధనలు అతిక్రమించి రోడ్లపై తిరిగే మూర్ఖులని క్వారెంటైన్ పేరుతో ఆసుపత్రికి తరలించాలి. ఇదీ మేధావులనుండి వస్తున్న విజ్ఞప్తి. వివేకం విచక్షణ కలిగిన జనం కోరుకుంటున్న కోరిక. డాక్టర్లు మందలిస్తున్నా, ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా మాకేం కాదులే అని రోడ్లపైన అడ్డంగా తిరుగుతూ కరోనా మహమ్మారిని ప్రజ్వలింప జేస్తున్న అక్షరాస్యత కలిగిన నిరక్షరాస్యుల గురించి వారు పడుతున్న ఆవేదన.**

కరోనా బారిన పడితే తీసుకెళ్లి ఆసుపత్రిలో పడేస్తున్నారు, ఖర్మకాలి చనిపోతే శవాన్ని కూడా చూడనీయడం లేదు. ఒక ఇంట్లో కరోనా రోగి ఉన్నాడంటే ఆ ఇంటి సభ్యులతో ఫోన్లో మాట్లాడడానికి కూడా చాలామంది ఇష్టపడడంలేదు. పరిస్థితి ఇంత దయనీయంగా వున్నా కానీ ఈ వితండపు వింత జనానికి అర్థం కావడం లేదు.

కోటిమందిలో ఒక్కడికే తగిలే లాటరీ తనకే వస్తుందని ఆశపడుతూ... కోటిమందిలో 90 లక్షలమందికి ఖచ్చితంగా వచ్చే అవకాశం వున్న కరోనా జబ్బు మాత్రం తనకు రాదులే అని ధీమాగా తిరుగుతున్న నిర్లక్ష్యపు జనాన్ని చూసి నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదు. సూపర్ మార్కెట్లకెళ్ళినా, షాపింగ్ సెంటర్ల కెళ్ళినా, మార్కెట్లుకెళ్ళినా, కిరాణా కొట్టుకెళ్లినా, మందుల షాపుకి వెళ్లినా, ఆసుపత్రికి వెళ్లినా, ఆఖరికి మద్యం షాపుల వద్ద చూసినా... ఒక్కచోట కూడా సామాజిక దూరం పాటించక పోవడం బాధాకరమైతే, వందలాది మంది యువత విచ్చలవిడిగా టీ అంగళ్లదగ్గర బాతాఖానీ కొడుతూ సిగరెట్లు కాలుస్తూ, గుట్కాలు తింటూ కనిపించడం చూస్తుంటే హతవిధీ వీరిని మార్చేవారే లేరా, భగవంతుడా వీరికి బుద్ధి రాదా అనే భావన కలుగుతోంది.

20 రోజుల కఠినమైన లాక్‌డౌన్ పెట్టి రోడ్లపై కనపడ్డ వాడిని కనపడ్డట్లుగా తీసుకెళ్లి పశువులను బందిలదొడ్లకు తోలినట్లుగా ఆసుపత్రులకు తరలిస్తే తప్ప బుద్ధి రాదని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. పోలీసు శాఖ కొంచెం కఠినంగా వ్యవహరించి కనీస నియమ నిబంధనాలన్నా ఖచ్చితంగా పాటించేలా చూడాలని లేదంటే కరోనా బారినుండి తప్పించు కోవడం మానవమాత్రులకు సాధ్యం కాదన్నది చాలామంది ఆవేదన. లాక్‌డౌన్ ఎత్తింది తిరగమనే గాని బరితెగించి తిరగమని కాదని సాక్షాత్తు భారత ప్రధానమంత్రి అన్నాడంటే ఈ జంకులేని జనాన్ని ఆ భగవంతుడే మార్చాలి.

# నెల్లూరొచ్చిన 69 వైద్య రథాలు



జూలై ఒకటో తేదీ దేశ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఒకేసారి 1088 కొత్త 104 ,108 వైద్య రథాలను ప్రారంభించి జాతీయ మీడియా మొత్తం ఆంధ్ర వైపు చూసేలా చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పేరు ఇప్పుడు దేశ వైద్యరంగంలో మారుమోగుతోంది. అయన ఆంధ్రా ప్రజలకు అంకితంచేసిన 1088 వైద్య రథాలలో 69 నెల్లూరు జిల్లాకు చేరాయి. బుధవారం జిల్లా జాయింట్‌కలెక్టర్ ప్రభాకరరెడ్డి, డియంఅండ్ హెచ్‌ఓ రాజ్యలక్ష్మి తదితరులు జిల్లా సరిహద్దు కావలిలో ఆ వాహనాలకు స్వాగతం పలికారు.

## 'ప్రభా'తం

# కోటికిపైగా కాటేసిన కరోనా

**కరోనా మహమ్మారి వ్యాధితో ఎంతో జాగ్రత్తగా ఉండాలి. లాక్‌డౌన్ సమయంలో నియమ నిబంధనలు పాటించిన ప్రజల్లో అన్‌లాక్ తర్వాత నిర్లక్ష్యంగా బాగా పెరిగింది. కరోనా విజృంభిస్తున్న ఇలాంటి తరుణంలో నిర్లక్ష్యం ఏమాత్రం మంచిది కాదు. మాస్క్ ధరించకుండా ఎవరూ బయటకు వెళ్ళకూడదు. కరోనా నియంత్రణకు అందరూ తప్పనిసరిగా ప్రభుత్వం సూచిస్తున్న నియమనిబంధనలు పాటించాలి.**

- ప్రధాని మోదీ (జూన్, 30)

కంటికి కనిపించని ఒక చిన్న క్రిమి ఇప్పుడు ప్రపంచాన్ని గజగజ వణికిస్తోంది. ఎప్పుడు ఎవరి ప్రాణం తీస్తుందో తెలియక.. అందరూ భయపడిపోయే స్థితికి తీసుకువచ్చింది. ప్రపంచానికే 'తాళం' వేసేలా చేసి ఆర్థిక పరిస్థితులన్నిటినీ అతలాకుతలం చేస్తోంది. జన జీవనాన్ని..జీవితాలను అల్లకల్లోలం చేసేస్తోంది. అగ్రదేశాలకు సైతం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది: మొత్తంగా ప్రపంచాన్నే స్తంభింపజేసేస్తోంది. కేవలం ఆరునెలల్లోనే ప్రపంచంలోని 213 దేశాల్లో కరోనా ఉగ్రరూపం దాల్చి.. కోటి దాటిన కేసులతో, సుమారు 5 లక్షల మరణాలతో కరోనా రాకాసి కరాళనృత్యం చేస్తూనే ఉంది. ప్రపంచాన్ని కకావికలం చేస్తూనే ఉంది.



**చైనాలోని వూహాన్‌లో పుట్టి, అమెరికాలో ఉగ్రరూపం దాల్చి, భారత్‌ను కూడా భయపెడుతూనే ఉంది కరోనా మహమ్మారి. ప్రపంచంలో కోటి మందికి పైగానే ఈ వ్యాధి సోకి విలవిలలాడుతున్నారు. 5 లక్షల మందికిపైగానే ఈ రాకాసి వ్యాధికి బలైపోయారు. న్యూజిలాండ్‌తో సహా 15 దేశాలు కరోనాను జయించేశామని చెప్పుకుంటున్నప్పటికీ మళ్ళీ అక్కడ కరోనా రాదని చెప్పలేని పరిస్థితి.**

అన్ని దేశాలు, అన్ని ప్రాంతాల్లో ఎప్పుడూ ఏదో ఒక సంచలనం, ఏదో ఒక ఉత్పాతం ఎప్పుడో ఒకప్పుడు జరుగుతుండడం సహజమే. కానీ ఇలా మొత్తం ప్రపంచమే వణికిపోయే దుస్థితి ఎప్పుడూ లేదు. ఈ యుగంలోనే కాదు, సృష్టి ప్రారంభమైన తర్వాత.. మానవ జీవనయానం ఆరంభమైనప్పటి నుంచి ఇలా ప్రపంచంలోని అన్ని దేశాలను, అన్ని ప్రాంతాలను ఒకేసారి ఇలా ఒక వైరస్ భయభ్రాంతులను చేస్తున్న వైనం..బహుశా ఇదే కావచ్చు.

కరోనా వ్యాధి..కోవిడ్-19 వైరస్..ఈ రెండు మాటలే ఇప్పుడు ఎక్కడ విన్నా. 2019 డిసెంబర్ చివరి తేదీన..చైనాలోని వూహాన్‌లో సార్స్ వంటి వైరస్ కేసులు వస్తున్నాయని తెలిసినప్పుడు ఇదేదో మామూలు వైరస్సేనని అందరూ అనుకున్నారు కానీ, ఇది ఇంతటి మహమ్మారి వ్యాధి అనీ, ప్రపంచమంతా శరవేగంగా వ్యాపిస్తూ ఎందరినో బలి తీసుకుంటుందని ఎవరూ ఊహించనే లేదు. ఆ విషయం తెలుసుకునేసరికే చాలా దేశాల్లో పరిస్థితి చేయిదాటిపోయింది. గతనెల జూన్ 30వ తేది మంగళవారం అర్ధరాత్రి సమయానికి ప్రపంచంలో కరోనా వ్యాధి కేసుల సంఖ్య కోటీ 4 లక్షలా 74వేలా 27కు చేరిందంటే..ఈ రాకాసి కాటుకు విలవిల్లాడుతూ ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 5 లక్షలా 9వేలా 742కు చేరుకుందంటే కరోనా మహమ్మారి వ్యాధి ప్రపంచమంతటా ఎంతగా విలయతాండవం చేస్తోందో అర్థమవుతుంది. ఇంతటి ఉపద్రవం, ఇంతటి విపత్తు, ప్రపంచంలో ఇంతటి భారీ మరణాలు పుట్టి బుద్దెరిగిన తర్వాత మనం కాదు..ప్రపంచమే ఎప్పుడూ కనీవినీ ఎరుగలేదు.

అగ్రరాజ్యం అమెరికాలో కరోనా మరింతగా కరాళనృత్యం చేస్తోంది. అసాధారణ రీతిలో ఇక్కడ పాతిక లక్షల మందికి పైగానే కరోనా వ్యాధితో అల్లాడిపోతున్నారు. ఇప్పటికే అక్కడ మృతుల సంఖ్య లక్షా 29వేలకు పైగానే ఉంది. నేటికీ అమెరికాలో రోజుకు సగటున 40 వేల మందికి కరోనా వ్యాధి సోకుతోందని గణాంకాలు చెప్తున్నాయి. ఒక్క అమెరికాలోనే కాదు, బ్రెజిల్, రష్యా, యుకె, స్పెయిన్, పెరూ, చిలీ, ఇటలీ, ఇరాన్, మెక్సికో, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇండోనేషియా, భారత్ ఇలా అన్ని దేశాల్లోనూ కరోనా విజృంభణ కొనసాగుతూనే ఉంది. భారత్‌లోనూ 5 లక్షల 66 వేలకు పైగానే కేసులుంటే, ఇప్పటికే మృతుల సంఖ్య 16,893కు చేరింది. అత్యధికంగా మహారాష్ట్రలో 1,69,883 కేసులు నమోదు కాగా, ఇక్కడ ఇప్పటికే 7610 మంది మరణించారు. ఈ మహమ్మారితో ఎంతో జాగ్రత్తగా ఉండాలని, నియమ నిబంధనల విషయంలో ఖచ్చితంగా ఉండాలని గతనెల 30న ప్రధాని మోదీ భారతప్రజలను మరోసారి గట్టిగా హెచ్చరించారు.

చైనాలోని వూహాన్‌లో పుట్టి, అమెరికాలో ఉగ్రరూపం దాల్చి, భారత్‌ను కూడా భయపెడుతూనే ఉంది మహమ్మారి కరోనా. న్యూజిలాండ్‌తో సహా ఓ 15 దేశాలు కరోనాను జయించేశామని చెప్పుకుంటున్నప్పటికీ మళ్ళీ అక్కడ కరోనా రాదని చెప్పలేని పరిస్థితి. చైనాను కూడా అదరగొడుతూనే ఉంది.

కరోనా వ్యాధి నియంత్రణకు ముందు జాగ్రత్తలు తీసుకోవడమే సరైన మందు. మాస్కులు ధరించడం, శానిటైజేషన్, చేతులు తరచూ సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, స్వీయనియంత్రణలో ఉండడం, మరీ అత్యవసరమైతే తప్ప ఇళ్ళలోంచి బయటకు రాకపోవడం, ఒక వేళ వచ్చినా భౌతిక దూరం పాటించడం వగైరా జాగ్రత్తలతో పాటు వ్యాధినిరోధక శక్తిని పెంపొందించుకునేందుకు తగ్గ ఆహారం స్వీకరిస్తుండడం కూడా ఎంతో ముఖ్యం. ఈ కరోనా కష్టకాలంలో ప్రజలే ఎవరికి వారు జాగ్రత్తలతో ఉంటూ కరోనాను జయించే యోధులుగా మారాలి. కరోనా పట్ల పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకోవాలి.

కరోనా రాకాసి ఒకవైపు విజృంభిస్తూనే ఉన్నా కరోనా కోరల నుంచి బయటపడుతున్న వారి సంఖ్య కూడా ఎంతో ఆశావహంగానే ఉంది. ప్రధానంగా వైద్యులు, వైద్యసిబ్బంది, పోలీసులు, అధికారులు..ఇలా అందరి పుణ్యమా అంటూ ఎంతో మంది కరోనా వ్యాధిగ్రస్తులు ప్రాణాలతో బయటపడుతున్నారు. మళ్ళీ ఆరోగ్యంగా తిరిగి ఇళ్ళకు వెళ్తున్నారు. ఇదెంతో సంతోషించదగ్గ విషయం.

ఇప్పటికే ప్రపంచంలో 1,04,54,904 మందికి కరోనా పాజిటివ్ కేసులు వస్తే, ఇందులో 57,07,741 మంది కోలుకున్నట్లు ప్రపంచ ఆరోగ్యసంస్థలు వివరిస్తున్నాయి. మరణాల రేటు కూడా 14 నుంచి 8 శాతానికి తగ్గడం కూడా వైద్యుల సేవలు, చికిత్సలతోనేనన్నది మరువకూడదు.

ఏదేమైనా ప్రపంచాన్ని ప్రాణభయంతో వణికిస్తున్న ఈ కరోనా మహమ్మారి పట్ల భయంతో కాకుండా, అట్లని నిర్లక్ష్యం వహించకుండా, ఈ ప్రాణాంతక వ్యాధి పట్ల పూర్తి అవగాహనతో..ప్రభుత్వాలు సూచిస్తున్న మేరకు నియమ నిబంధనలు పాటిస్తూ...ఎంతో అప్రమత్తంగా ఉంటూ ముందు జాగ్రత్తలతో జీవనయానం సాగించడమే అందరికీ శ్రీరామరక్ష!...

## అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

భక్తుల కొంగుబంగారంగా విడవలూరులో వెలసిన గ్రామదేవత అంకమ్మతల్లికి గతనెల 26న ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తొలుత, అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి కుంకుమపూజ, విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకుడు గిరి ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సూళ్ళూరుపేటకు చెందిన సాయిబాబా, మస్తానమ్మ దంపతులు ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## పోలేరమ్మ మండపానికి రూ.10లక్షల విరాళం

నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరులో నిర్మాణంలో వున్న పోలేరమ్మ మండపానికి తుదిమెరుగులు దిద్దేందుకు ఓ అజ్ఞాత భక్తుడు రూ.10లక్షల విరాళాన్ని ప్రకటించినట్లు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి, ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉంటే మరో అజ్ఞాత భక్తుడు ఆలయానికి మినరల్‌వాటర్ సిస్టంను అందజేశారు. రిషిత, రత్నమ్మ అనే భక్తులు 200 గ్రాముల వెండి వడ్డాణం, 100 గ్రాముల పాదుకలను బహుకరించారు.

### కరోనాను పోగొట్టాలంటూ..

## మహాశివునికి రుద్రాభిషేకం

కరోనా మహమ్మారి వ్యాధిని పోగొట్టాలని ఆ పరమశివుని ప్రార్థిస్తూ లోకకల్యాణం కోసం ఆత్మకూరు సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గతనెల 28న సామూహిక రుద్రాభిషేకం నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని శివాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ పూజారి మేళ్ళచెరువు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు. అనంతరం, రాష్ట్ర అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడిగా ఎంపికైన శివకుమార్‌శర్మను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మహిళా విభాగం సభ్యులు కొండూరు అపర్ణ, కోటపాటి విజయలక్ష్మి, మురళీ కృష్ణమాచార్యులు, డి.ప్రవీణ్‌కుమార్, కోటపాటి రామయ్యస్వామి, కొండూరు శ్రీనివాస చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.




## ఆర్య వైశ్యులకు తరతరాలుగా అన్యాయమే!

గతవారం 'లాయర్' పత్రికలో 'నవతరం నేత... ముక్కాల ద్వారక' అంటూ రాసిన వార్త చాలా బాగుంది. తరతరాలుగా ఆర్యవైశ్యులను అన్ని పార్టీలూ వాడుకుంటున్నాయి తప్ప ప్రాధాన్యత కలిగిన పదవులను వారికి ఇవ్వడంలేదు. ఈ విషయాలను చక్కగా రాశారు.

1930 ప్రాంతములో బచ్చు వెంకటసుబ్బయ్య మునిసిపల్ ఛైర్మెన్‌గా పని చేశారు. ఆ తరువాతి కాలంలో సుంకు చెంగల్‌రాయశెట్టి పూర్తి కాలం వైస్‌ఛైర్మెనుగాను ఆరు నెలలపాటు ఇన్‌ఛార్జి ఛైర్మెనుగాను పనిచేయడమే కాకుండా, ఎంయల్‌సిగా కూడా నెల్లూరునుండి శాసన మండలిలో ప్రాతినిధ్యం వహించాడు. మీరు పేర్కొన్నట్లుగా తరువాతి తరాలలో ఎవరూ అంతగా రాణించలేదు. ఇన్నాళ్లకు వైశ్యులకు ద్వారక ద్వారా రాష్ట్రస్థాయి గుర్తింపు వస్తోంది. రాబోయే రోజుల్లో చట్టసభల్లో కూడా శెట్టిగార్లకు మంచి స్థానం లభిస్తుందని ఆశిస్తున్నాను.

**రఘునాథ్ గుప్త.కె, చెన్నై.**

### కరోనా బాధితుల సమాచారంలో

## స్పష్టత ఉండాలి

కరోనా మహమ్మారి రోజురోజుకూ పెరుగుతోంది. ఎప్పుడు ఎక్కడ ఎవరికీ ఎలావస్తుందో తెలియడములేదు. జిల్లా అధికారులు కరోనా బాధితుల విషయములో స్పష్టత ఇవ్వాలి. మన పక్కింట్లో వ్యాధిగ్రస్తుడున్నా కూడా మనకు తెలియడంలేదు. జిల్లాలో ఏఏ ప్రాంతాలలో ఉందో తెలపడంతోపాటు వారి చిరునామాలు కూడా ఇవ్వగలిగితే కనీసం వారి ఇరుగు పొరుగు వారు జాగ్రత్తగా వుంటారు. గ్రామాల పరిధి తక్కువ కాబట్టి అక్కడ అవసరం లేదు, కానీ నగర విస్తీర్ణం పెద్దది, కాబట్టి నగరంలోనన్నా వ్యాధిగ్రస్తుల వివరాలు చిరునామాలతో సహా మీడియా ద్వారా తెలియజేస్తే బాగుంటుందేమో అధికారులు ఆలోచించాలి.

**ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.**

## రాజ్యాంగ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న వారిని వెలి వెయ్యాలి

రాజ్యాంగ వ్యవస్థలు భ్రష్టు పడుతున్నాయి. కుల రాజకీయాలకు, స్వార్థ ప్రయోజనాలకు రాజ్యాంగ వ్యవస్థలను వాడుకుంటున్న రాజకీయ నేతలని పార్టీలని వెలి వెయ్యాలి. భారత రాష్ట్రపతి జోక్యం చేసుకుని ఇలాంటి పార్టీలని వ్యక్తులని అనర్హులుగా ప్రకటించాలి. ఎలక్షన్ కమిషనర్ స్థాయిలో వున్న ఒక ఐఏఎస్ అధికారి నిస్సిగ్గుగా 5 నక్షత్రాల హోటల్‌కెళ్ళి రాజకీయ నేతలతో మంతనాలు జరపడం సిగ్గుచేటైన విషయం. ఇలాంటి అధికారులపై తీసుకునే చర్యలు చూసి భవిష్యత్‌లో ఎవరైనా ఇలాంటి పని చేయడానికి భయపడేలా ఉండాలి. చిన్న విషయాలలో సైతం జోక్యం చేసుకుంటున్న న్యాయ వ్యవస్థ ఇలాంటి వ్యవహారాల్లో కఠినంగా ఉండాలి. భారత్ మాతాకీ జై....!

**- యం.చంద్రమౌళి, కొత్త ఢిల్లీ.**

## ఆకతాయిల ఆట కట్టించాలి

మండలకేంద్రమైన విడవలూరులో సాయిబాబాగుడి, జడ్పీహైస్కూల్, మసీదు సెంటర్ తదితర ప్రాంతాల్లో జూదరుల అల్లరి మితిమీరిపోతోంది. పులిమేక, చింతపిక్కలాటలతో అంతా గోలగా ఉంటోంది. వీరి గోలను జనం భరించలేకపోతున్నారు. తాగుబోతులు కూడా వీరి జత చేరుతున్నారు. అర్ధరాత్రుల్లోనూ వీరంగం చేస్తున్నారు. ఇళ్ళ వద్దకు వచ్చి తలుపులు తట్టడం, పరుగులు తీయడం, అసభ్యకరంగా మాట్లాడడం వంటి చేష్టలతో ప్రజలను బాధిస్తున్నారు. పోలీసులు రంగంలోకి దిగి ఈ ఆకతాయిల ఆట కట్టించాలి.

**- పవన్, విడవలూరు.**

● పేద విద్యార్థులకు చేయూతనిచ్చే...

# 'నాడు-నేడు'పై.. ఇంత నిర్లక్ష్యమా?



**ఎంతోకాలంగా అసౌకర్యాలకు నిలయాలుగా ఉన్న బడులను బాగుచేసేందుకు ప్రభుత్వం ముందుకొస్తే సంబంధిత సిబ్బందిలో మాత్రం స్పందన ఉండడం లేదు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని తపన పడుతున్న ముఖ్యమంత్రి జగన్ ఆశయాలను అమలుపరచడంలో అలా నిర్లిప్తత ప్రదర్శిస్తున్న ఇటీవల నెల్లూరు జిల్లాలోని అనేకమంది ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులకు జిల్లా ఉన్నతాధికారులు నోటీసులు అందజేశారు. 14 మంది ఎంఇఓలకు, 353 మంది ప్రధానోపాధ్యాయులకు ఒకేసారి నోటీసులు ఇచ్చి..పనితీరు మార్చుకోకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరిస్తున్నారు.**

- 353 మంది హెడ్మాస్టర్లకు, 14 మంది ఎంఇఓలకు నోటీసులు
- అలక్ష్యంగా ఉన్నవారిపై చర్యలకు సిద్ధమవుతున్న అధికారులు

ప్రభుత్వ పాఠశాలలంటేనే వసతులేమీ ఉండవని, మరుగుదొడ్లు, మంచినీళ్ళు వంటి ప్రాథమిక సౌకర్యాలు కూడా ఉండవని ఎంతోమంది ప్రభుత్వ బడులకు తమ పిల్లలను పంపేందుకు భయపడుతుంటారు. చదువు చెప్పేందుకు మంచి అయ్యవార్లున్నా వసతులు లేకపోతే ఎలా?..అని పిల్లల తల్లిదండ్రులు వారిని ప్రభుత్వ పాఠశాలలకు పంపేందుకు అయిష్టత చూపుతుంటారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలపై ఎంతోకాలం నుంచి ఉన్న ఇలాంటి అభిప్రాయాలను పోగొట్టేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించి పేదపిల్లలకు ఉన్నతస్థాయిలో చదువులు చెప్పించేందుకు, కార్పొరేట్ పాఠశాలల్లాగానే ప్రభుత్వ పాఠశాలలను కూడా తీర్చిదిద్దేందుకు రాష్ట్రప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేనంతగా పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తోంది. జిల్లాలోని పాఠశాలలు సరస్వతీ నిలయాలుగా కళకళలాడేలా ఉండాలని ఇటీవలికాలంలో బడుల్లో బాలబాలికలకు వసతుల కల్పనకు భారీగా నిధులు కేటాయించింది. అయితే కొంతమంది మన పెద్దయ్య వార్లు, సంబంధిత విద్యాశాఖ అధికారులు మాత్రం ఆశించిన స్థాయిలో స్పందించకపోవడంతో నిధులున్నా పనులు మాత్రం మందకొడిగా జరుగుతున్నాయి. ఇలా లక్ష్యాలను లెక్కపెట్టకుండా చిత్తం వచ్చిన రీతిలో వ్యవహరిస్తున్న వారిపట్ల ఉన్నతాధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### కోట్లల్లో నిధులిచ్చినా.. పనులు నత్తనడకేనా?

'మనబడి నాడు-నేడు' అనే పథకం కింద జిల్లాకు తొలి దశలో 1060 బడుల్లో అభివృద్ధిపనులు చేపట్టేందుకు 283 కోట్ల రూపాయలు మంజూరుచేసింది కూడా. తొలివిడతగా 117.50 కోట్ల రూపాయలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఖాతాలకు బదిలీ చేశారు. ఆ నిధులతో 667 ప్రాథమిక పాఠశాలల్లోను, మరో 138 ఉన్నత పాఠశాలల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టాల్సిన ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ ఆదేశాలను లెక్కపెట్టడం లేదు. నిధులు పుష్కలంగా ఇచ్చినా వారు ఆశించిన స్థాయిలో స్పందించక పనులు చేపట్టడంలో అలక్ష్యం వహిస్తుండడం ఏమిటని జిల్లా ఉన్నతాధికారులు వారి పనితీరు పట్ల గుర్రుగా ఉన్నారు. వాస్తవానికి ఈ పనులన్నిటినీ ఎంతో వేగవంతంగా చేయాల్సి ఉంది. వచ్చే నెలాఖరుకల్లా నిర్దేశించిన పనులన్నిటినీ పూర్తిచేయాల్సి ఉంది. అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, అదనపు గదుల నిర్మాణం వగైరాలన్నీ వచ్చే నెల 10వ తేది నాటికి ఏర్పాటుచేయాల్సి ఉంది. జులై చివరి నాటికి పాఠశాలల్లో పెయింటింగ్, ఫ్లోరింగ్, ఫర్నిచర్, ట్యూబులైట్లు, ఫ్యాన్లు, మంచినీటికి కొదవ లేకుండా ఆర్ఓ ప్లాంట్లు అన్నిటినీ సిద్ధం చేయాల్సి ఉంది. విద్యార్థుల చదువులకు ఇబ్బంది లేకుండా ఈ వసతులన్నీ సమకూర్చి వారిలో నూతనోత్సాహాన్ని కల్పించాల్సిన సంబంధిత అధికారులు మాత్రం ఈ పనులను అశ్రద్ధ చేస్తుండడంతో జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయాన్ని గమనించి చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.

### నెల్లూరు జిల్లాలోనే ఇంత అలక్ష్యం :

ఎంతో ముఖ్యమైన ఈ పనుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తారేమోనని ప్రభుత్వం ముందుగానే అంచనా వేసుకుని ఎందుకైనా మంచిదని, ఈ పనులు ఆలస్యం కాకుండా ఉండడానికి ప్రభుత్వం ప్రతి మండలానికి పర్యవేక్షక అధికారులను కూడా నియమించింది. అయినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల అభివృద్ధి పనులు ఎంతో చురుగ్గా జరుగుతున్నా ఒక్క నెల్లూరు జిల్లాలో మాత్రం నత్తనడకన నడుస్తుండడం ఏమిటని ఉన్నతాధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన నిధులను సకాలంలో వెచ్చించకపోవడం, అభివృద్ధి పనులు చేపట్టడంలో అలక్ష్యం వహిస్తుండడంతో సంబంధిత ప్రధానోపాధ్యాయులకు, ఆయా మండలాల విద్యాశాఖ అధికారులకు ఈనెల 27న తాఖీదులు ఇచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రభాకరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దనాచార్యులు ఇచ్చిన ఈ నోటీసులపై వారు మూడు రోజుల్లో రాతపూర్వకంగా సమాధానం చెప్పడంతో పాటు పనితీరు బాగా మార్చుకోవాల్సి ఉంది. పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాల్సి ఉంది. లేకుంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

---

# 'గుట్కా'యు స్వాహా

- 15 లక్షలు విలువచేసే సరుకు స్వాధీనం
- మరో అయిదుగురు అరెస్ట్

కావలిలో నిషేధిత గుట్కాలను విక్రయిస్తున్న అయిదు గురితో పాటు మరో అయిదు గురు నిందితులు కూడా పోలీసులకు దొరికిపోయారు. భారీగా గుట్కాల అక్రమ నిల్వలు కూడా బయటపడుతున్నాయి. బెంగుళూరు నుంచి టమోటాల లోడ్ మాటున నిషేధిత గుట్కాలను రహస్యంగా తెప్పించుకుని పోలీసుల కళ్ళుగప్పి వాటిని కావలి తదితర ప్రాంతాల్లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్న అయిదుగురు నిందితులను పోలీసులు ఇటీవల అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ కేసులో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేయడంతో భారీగా గుట్కా ప్యాకెట్లు బయటపడడమే కాక, మరికొందరు అక్రమార్కులు కూడా ఈ వ్యవహారంలో ఉన్నట్లు తేలడంతో, అసలు ఈ తీగ ఎంత దూరం ఉందో నిగ్గు తేల్చడానికి కావలి పోలీసులు డొంకంతా కదిలిస్తున్నారు. తాజాగా గతనెల 26న కావలి సమీపంలోని ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలంలోని రామచంద్ర అగ్రహారం గ్రామంలో గుట్కా స్థావరాలపై దాడులు చేసి ఆ గ్రామానికి చెందిన వెంకటేశ్వరరాజు అలియాస్ తెట్టు రాజు ఇంట్లో ఉన్న 15 లక్షల రూపాయల విలువచేసే గుట్కాలను పట్టుకోవడం మరింత సంచలనం కలిగిస్తోంది. అయితే పోలీసులు అక్కడికి చేరుకునేసరికి వెంకటేశ్వరరాజు అక్కడి నుంచి పారిపోవడంతో ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఈనెల 26 నాటికి పదిమందిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. అంతేకాక, ఈ అక్రమ వ్యాపారానికి సంబంధించి 15 లక్షలా 37వేల రూపాయలు విలువచేసే గుట్కాలతో పాటు 46.56 లక్షల రూపాయల నగదును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అంతేకాదు, ఈ గుట్కాల వ్యాపారం వెనుక కావలికి చెందిన ఇద్దరు రాజకీయ నాయకుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతుండడంతో ఆ గుట్టును రట్టు చేయడానికి వారి వ్యవహారాలపై కూడా పోలీసులు రహస్యంగా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కావలి డిఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు తదితర పోలీసు సిబ్బంది ఈ కేసును ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

## ఇసుక.. ఇక ఇళ్ళ ముంగిళ్ళకే

లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా ఇక ఇసుకను డోర్ డెలివరీ చేయడానికి పూర్తిస్థాయిలో సన్నాహాలు చేస్తున్నామని, త్వరలో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్ వెల్లడించారు. జిల్లాలో ఏ గ్రామ సచివాలయం నుంచైనా ఇసుక కోసం దరఖాస్తు చేసుకుంటే డోర్ డెలివరీ చేస్తామని ఆయన చెప్పారు. మరో వారం రోజుల్లో సంగం పెన్నానది నుంచి ఇసుక తరలింపు ప్రారంభమవుతుందని, వర్షాకాలంలో కూడా ఇసుక తరలింపునకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నామన్నారు.

---

జిల్లాలో పెరుగుతున్న..

# నాటు సారా జోరు

- మద్యానికి బదులుగా సారాని ఎంచుకుంటున్న మందుబాబులు
- తయారీదారులపై నిఘా పెంచిన అధికారులు

**మద్యానికి బదులుగా సారా తాగేందుకు కూడా అనేకమంది మందుబాబులు సిద్ధం అవుతుండడంతో జిల్లాలో రహస్యంగా సారా జోరు పెరిగిపోతున్నట్లు సమాచారం. దీంతో అధికారులు రంగంలోకి దిగి సారా తయారీని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్య నిషేధం అమలుకు అడుగులు వేస్తున్న నేపథ్యంలో అధికారులు సారా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమవుతున్నారు.**



కరోనా, లాక్‌డౌన్ల నేపథ్యంలో మద్యం ధరలు భారీగా పెరగడం, సరిగా అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో అనేకమంది మందుబాబులు సారా తాగడానికి కూడా సిద్ధమవుతుండడంతో జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఇదే అదనుగా సారా తయారీ జోరుగా ఉన్నట్లు సమాచారం. మద్యానికి బదులు సారాయే ప్రత్యామ్నాయంగా మందుబాబులు ఈ దారిని ఎంచుకుంటున్నారని, దీంతో సారాకు బాగా గిరాకీ పెరిగిందని తెలుస్తోంది. ఇక ఇదే సందని తయారీదారులు సారా ధరను లీటరు వెయ్యి నుంచి పదిహేను వందల రూపాయల దాకా పెంచి అమ్ముకుంటున్నారట కూడా. ఈ విషయం తెలిసిన ఎక్సైజ్ అధికారులు జిల్లాలో ఎక్కడెక్కడ నాటుసారా బట్టీలు పెడుతున్నారో నిఘా పెట్టి ఎక్కడైనా నాటుసారా తయారుచేస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే వెళ్ళి వాటిని ధ్వంసం చేస్తున్నారు. పోలీసులు కూడా రంగంలోకి దిగి నాటుసారా తయారీని అరికట్టేందుకు దాడులు విస్తృతం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని సర్వనాశనం చేసే నాటుసారా తయారీదారులపై ఉక్కుపాదం మోపేందుకు అధికారులు సిద్ధమయ్యారు. జిల్లాలో ముఖ్యంగా కావలి, బుచ్చి, కోవూరు, ఉదయగిరి, సూళ్ళూరుపేట తదితర ప్రాంతాల్లోని అటవీ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల్లో తయారీదారులు రహస్యంగా నాటుసారా కాస్తున్నట్లు తెలియడంతో అధికారులు ఆయా ప్రాంతాల్లో దాడులు చేసి ఇప్పటికే వాటిని ధ్వంసం చేశారు. సుమారు 8 వేల లీటర్లకు పైగానే నాటుసారా తయారీ కోసం సిద్ధం చేస్తున్న బెల్లం ఊటను ధ్వంసం చేసి, తయారీదారులపై కేసులు కూడా నమోదు చేశారు.

# నెల్లూరు కబుర్లు




## కలెక్టరేట్ సందర్శకులకు 'నో ఎంట్రీ'

జిల్లాలో కరోనా కేసులు రోజు రోజుకు విజృంభిస్తున్న నేపథ్యంలో నెల్లూరులోని కలెక్టరేట్‌లో సందర్శకులను అనుమతించడం లేదని డిఆర్‌ఓ మల్లికార్జున గతనెల 29న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసరమైన అర్జీలు అందజేయాలనుకునేవారు స్పందన వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కాగా, కరోనా వ్యాధి నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ఏఓ రామారావు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం లోని అన్ని గదులతో పాటు పరిసరాల్లో కూడా హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్నారు. కలెక్టరేట్‌లో పలువురికి కరోనా పాజిటివ్ రావడంతో అధికారులు ఈ వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఉద్యోగులందరికీ కరోనా పరీక్షలు చేయిస్తున్నారు కూడా.

## ప్రజలు అసంతృప్తితో వెళ్లకూడదు

**సచివాలయ సిబ్బందితో జేసీ**



సచివాలయానికి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోలేకుండా అసంతృప్తితో వెళ్ళకూడదని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సచివాలయ ఉద్యోగులు సంసిద్ధంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. గతనెల 27న ఆయన నెల్లూరు శివారుల్లోని పోలీసు కాలనీ, జెవిఆర్ కాలనీల్లోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ సేవలు పొందడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో ప్రజలకు తగు సేవలందించాలన్నారు. జూలై 8న ఎంతో ప్రతిష్టాత్మకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ళస్థలాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను ఆయన ఈ సందర్భంగా ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. సిటిజన్ చార్ట్ అమలు తీరును పరిశీలించారు. పాలనా పరంగా లోపాలు లేకుండా చూసుకోవాలని, ఎక్కడ నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని ఆయన సిబ్బందిని హెచ్చరించారు.

## దొంగలున్నారు జాగ్రత్త...



చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు నగర డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి సూచించారు. చోరీలపై ప్రజలను చైతన్యవంతులను చేయడానికి నవాబుపేట పోలీసులు రూపొందించిన కరపత్రాలను డిఎస్పీ కార్యాలయంలో గత నెల 28న ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ లాక్‌డౌన్ సడలింపులు, వేసవి దృష్ట్యా చోరీలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్ళు విడిచి ఊళ్ళకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకూడదని కోరారు. లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం సేవలను వినియోగించుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్ వాసులు, దుకాణ సముదాయాల యజమానులు సి.సి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే డయల్ 100కు సమాచారమివ్వాలని కోరారు. నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో 27వేల ఇళ్ళు ఉన్నాయని, ప్రతి ఇంటికి కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలను అప్రమత్తం చేస్తామన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఎస్సై శివప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### రంగుల కోసం...

## ప్రజాధనం రూ.300 కోట్లు వృధా

**కోటంరెడ్డి శ్రీనయ్య విమర్శ**



రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే రూ.300 కోట్ల ప్రజాధనంతో రంగులు వేయడం అవసరమా అంటూ తెలుగుదేశం పార్టీ నెల్లూరు నగర ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత నెల 28న నెల్లూరు టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి రంగులు తొలగించాలంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆ పార్టీకి చెంపపెట్టన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వేసిన రంగుల ఖర్చు రూ.300కోట్లు ముఖ్యమంత్రి సొంత ఆస్తుల నుండి వసూలు చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయాల నుంచి రాష్ట్ర మంత్రుల దాకా అందరూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా నెల్లూరులో మాజీమంత్రి నారాయణ చేసిన అభివృద్ధే కనిపిస్తోందన్నారు. కోట్ల రూపాయలతో పూర్తిచేసిన సంగం వాటర్ పైప్‌లైన్ ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ఇంటింటికీ స్వచ్ఛమైన నీరివ్వకపోతే పబ్లిక్‌హెల్త్ ఆఫీసు ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. నాయకులు పిట్టి సత్యనాగేశ్వరరావు, కప్పిర శ్రీనివాసులు, శేషయ్య, జలదంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### రక్తదానం చేసేందుకు

## యువత ముందుకు రావాలి

లాక్‌డౌన్ నేపథ్యంలో రక్తనిధిలో నిల్వలకు కొరత ఏర్పడిందని, రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గత నెల 28న నెల్లూరు ఇండియన్ రెడ్‌క్రాస్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటశేషయ్య ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో యువత రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో 80మంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ ఇన్‌ఛార్జి అజయ్, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పోలినేని సదాశివ ఆచారి, ప్రధాన కార్యదర్శి సురేష్‌ఆచారి, కోశాధికారి ఏలూరు బాబు, ఇలపాక శివప్రసాద్, శివరామకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ చేయూత

మైనార్టీ మహిళలకు 'వైయస్సార్ చేయూత' పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పించనున్నట్లు మైనార్టీ సంక్షేమ అధికారి హమీద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 45-60 ఏళ్ళలోపు వయసు కలిగిన వారిలో అర్హులు వాలంటీర్ల వద్ద జూలై 2వ తేదీలోగా పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

## 'కాపు నేస్తం' 24 దాకా

కాపు నేస్తం పథకం కింద లబ్ధి పొందని వారిలో అర్హులు ఇంకా ఎవరైనా ఉంటే జూలై 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కొణిదెల సుధీర్ తెలిపారు.

### కార్పొరేషన్‌కు

## కొత్త ఇన్‌చార్జి ఎస్ఇ

నెల్లూరు కార్పొరేషన్ ఇన్‌చార్జి ఇంజనీరింగ్ సూపరింటెండెంట్‌గా ఎ.ఇ టిఎస్ సంజయ్‌ను నియమిస్తూ ప్రభుత్వం గతనెల 29న ఉత్తర్వులు జారీచేసింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇమాముద్దీన్ అనారోగ్య సమస్యలతో సెలవుపై వెళ్ళడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి ఎస్ఇగా సంజయ్‌ను నియమించారు.

### మాస్కులు పంపిణీ చేసిన

## రోటరీ కార్యదర్శి

కరోనా నేపథ్యంలో సామాజిక దూరం పాటించాలని అందరికీ చెప్తూ నెల్లూరులోని ఏసి కూరగాయల మార్కెట్ పరిసరాల్లో నెల్లూరు రోటరీక్లబ్ సౌత్ కార్యదర్శి షేక్ అజీజ్ ఆధ్వర్యంలో మాస్కులు పంపిణీ చేశారు. గతనెల 27న ఈ కార్యక్రమం నిర్వహించారు. నిరుపేదలకు, చిరు వ్యాపారులకు, ప్రయాణీకులకు వారు మాస్కులను అందజేసి కరోనా వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## పైపైకి పోతున్న టమోటా ధరలు



లాక్‌డౌన్ సడలింపులతో అన్ని ప్రాంతాలకు టమోటా ఎగుమతులు జరుగుతుండడంతో, ఇదే సమయంలో టిఫిన్ సెంటర్లు, హోటళ్ళు ప్రారంభం కావడంతో వీటి వినియోగం పెరిగింది. దీంతో టమోటా ధర ప్రస్తుతం దాదాపు రూ.60 నుంచి రూ.65లు దాకా అమ్ముతుండడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. జూన్ మొదటివారంలో హోల్‌సేల్ మార్కెట్లో కిలో టమోటా రూ.10, రూ. 15లుగా ఉండేది. బహిరంగ మార్కెట్లో రూ.15, రూ. 20లు పలికింది. అప్పటినుండి రోజురోజుకు ధర పెరుగుతూ వచ్చింది. జిల్లాకు ప్రధానంగా మదనపల్లె మార్కెట్ నుంచి టమోటా దిగుమతి అవుతుంది. లాక్‌డౌన్ నేపథ్యంలో బయట రాష్ట్రాలకు ఎగుమతులు నిలిచిపోయాయి. ఒకానొక దశలో టమోటా పండించిన రైతులు ధరలు లేక వాటిని పారబోసే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం లాక్‌డౌన్ సడలింపుతో వీటి వినియోగం పెరిగిపోవడంతో కొందరు వ్యాపారులు బాగా ధరలు పెంచి అమ్ముతున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి.

## ద్వారకకు 'చిన్ని' అభినందన



ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైనా యువనేత ముక్కాల ద్వారకానాథ్‌ను రాష్ట్ర రచయితల సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి, ప్రముఖ కవి చిన్ని నారాయణరావు అభినందించారు. గతనెల 27న ఆయన ద్వారక నివాసంలో కలిసి శాలువతో సన్మానించారు. నారాయణరావుతో పాటు చార్టెడ్ అకౌంటెంట్ చిన్ని శ్రావణ్‌కుమార్, పలువురు కవులు పాల్గొన్నారు.

## సచివాలయాల ద్వారా విద్యుత్ సేవలు

సచివాలయాల ద్వారా అన్ని రకాల విద్యుత్ సేవలను మెరుగ్గా అందిస్తామని విద్యుత్‌శాఖ ఎస్.ఇ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని వేదాయపాళెం సచివాలయాన్ని గత నెల 29న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా విద్యుత్‌శాఖకు సంబంధించి 56 రకాల సేవలు అందిస్తున్నామన్నారు. ఏ.ఇలు, ఏ.డిలు, డి.ఇలు ఖచ్చితంగా సచివాలయాలను సందర్శిస్తూ విద్యుత్ సేవలు ప్రజలకు ఎలా అందుతున్నాయో పరిశీలించాలని సూచించారు. ఏడీలు ఎన్‌కె అల్తాఫ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారస్తులు నిబంధనలను పాటించాలి

కోవిడ్ నిబంధనలను వ్యాపారస్తులు తప్పక పాటించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ పిడుగు వెంకటరమణ హెచ్చరించారు. గత నెల 28న మినీబైపాస్ రోడ్డులోని అన్నమయ్య సర్కిల్, బి.వి.నగర్, కొండాయపాళెం గేట్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కరోనా నిబంధనలను పాటించకుండా కొందరు వ్యాపారాలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారులు మాస్కులు, శానిటైజర్లు తప్పక వినియోగించాలని కోరారు. కరోనా నియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. శానిటరీ సూపర్‌వైజర్ ప్రతాప్‌రెడ్డి, శానిటరి ఇన్స్‌పెక్టర్ నరశింహారావు పాల్గొన్నారు.

### నవంబర్ వరకు

## ఉచితంగా రేషన్

కోవిడ్-19 మహమ్మారి విజృంభిస్తుండడంతో కేంద్ర ప్రభుత్వం మరో 5 నెలలు.. నవంబర్ వరకు రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం, శనగలు అందించనుంది. దీంతో జిల్లాలోని 9,16,024 బియ్యం కార్డుదారులకు లబ్ధి చేకూరనుంది. ఈనెల 3వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు సరుకులు పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

## మాస్కు వేసుకోమన్నందుకు...
# దివ్యాంగురాలిపై ఇంత దారుణమా!.

**అసలే కరోనా పొంచివుండి ప్రాణాలు తీస్తున్న కాలం. అయినా, మంచి చెప్పినా వినని రోజులివి. మాస్కు ధరించకపోతే ప్రాణాలకే ప్రమాదం అని ప్రభుత్వాలు పదేపదే మొత్తుకుంటున్నా పట్టించుకోని ఓ అధికారిని, మాస్కు ధరించండి మహాప్రభో అని కిందిస్థాయి ఉద్యోగిని చెప్పినందుకు 'నాకే చెప్తావా'.. అంటూ జుట్టుపట్టుకుని ఈడ్చికొట్టి, కనీసం దివ్యాంగురాలనే కనికరం కూడా లేకుండా అత్యంత దుర్మార్గంగా దాడిచేశాడా అధికారి. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.**

- మహిళా ఉద్యోగిపై అమానుష దాడి
- అధికారి అరెస్ట్.. నిర్భయ కేసు నమోదు


బాధితురాలిని పరామర్శిస్తున్న మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

నెల్లూరులోని టూరిజం శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఒక దివ్యాంగురాలిపై అదే శాఖలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్న అధికారి అత్యంత పాశవికంగా దాడికి పాల్పడ్డాడు. మాస్కు ధరించమని చెప్పినందుకు ఆ అధికారి ఆగ్రహంతో దాడికి పాల్పడిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ ఉద్యోగినిపై అధికారి పిడిగుద్దులతో కొడుతూ, మరింత కోపంతో కుర్చీకున్న హ్యాండిల్ కర్రతో ఇష్టమొచ్చినట్లు చితక బాదాడు. జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ఈ ఘటన సంచలనం కలిగించింది. జిల్లా ప్రజానీకాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేసింది.

కరోనా నేపథ్యంలో.. నెల్లూరులోని ఏపి పర్యాటక అభివృద్ధి శాఖ హోటల్‌ను ప్రభుత్వం ఇటీవల క్వారంటైన్ కేంద్రంగా ఏర్పాటు చేసింది. ఉద్యోగులంతా మాస్కులు ధరించి విధులకు హాజరవుతున్నారు. కానీ అడ్మిన్ డిప్యూటీ మేనేజర్ భాస్కర్ గతనెల 27న కార్యాలయానికి వచ్చినప్పుడు మాస్కు లేకుండా సీనియర్ అసిస్టెంట్ అయిన ఓ మహిళా ఉద్యోగితో మాట్లాడుతుండగా, ఆ ఉద్యోగిని ఆయనకు మాస్కు ధరించండని గుర్తుచేశారు. దీంతో భాస్కర్ 'నాకే చెప్తావా' అంటూ ఆగ్రహంతో రెచ్చిపోయాడు. ఆమె దివ్యాంగురాలన్న కనికరం కూడా లేకుండా పిడిగుద్దులతో బాదాడు. అప్పటికీ కోపం తీరక కుర్చీ హ్యాండిల్‌కర్రతో తీవ్రంగా కొట్టాడు. అడ్డుకోబోయిన ఉద్యోగులపై కూడా కోపంతో ఊగిపోయాడు. బాధితురాలు తనపై జరిగిన దాడి గురించి అదే రోజున నెల్లూరులోని దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ వెంటనే రంగంలోకి దిగి పూర్వాపరాలు విచారించి నిందితుడిపై కేసులు నమోదు చేశారు. దాడికేసుతో పాటు మహిళా ఉద్యోగి..దివ్యాంగురాలైన ఆ అసహాయురాలిపై అమానుషంగా దాడిచేసినందుకు నిర్భయ కేసు కూడా నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా హోటల్‌లో సిసిటివి ఫుటేజీలు కూడా సేకరించారు. అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి కూడా. పోలీసులు నిందితుడిని గతనెల 30న అరెస్ట్ చేశారు. నగర డిఎస్పీ జె.శ్రీనివాసులురెడ్డి ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మీడియాకు వివరించారు. జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ ఆదేశాల మేరకు ఈ కేసును దిశ పోలీస్‌స్టేషన్‌కు బదలాయిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఆయన వివరించారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే మంత్రి అవంతి శ్రీనివాస్ ఆదేశాలపై నిందితుడు భాస్కర్‌ని వెంటనే సస్పెండ్ చేశామని పర్యాటక అభివృద్ధి సంస్థ ఎం.డి ప్రవీణ్‌కుమార్ చెప్పారు.

### మరీ ఇంత దుర్మార్గమా?...
**- మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ ఆగ్రహం**

ఓ మహిళా ఉద్యోగి.. అందులోనూ దివ్యాంగురాలిపై దాడి చేయడం ఎంత దారుణం?.. ఇంత విచక్షణా రహితంగా మహిళా ఉద్యోగిపై దాడి చేయడం, కర్రతో కొట్టి.. కాళ్ళతో తన్ని, జుట్టు పట్టుకుని ఈడ్చికొట్టడం.. ఏమిటింత ఘోరం. ఇది క్షమించరాని నేరం..అంటూ మహిళా కమిషన్ రాష్ట్ర ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు నెల్లూరులోని టూరిజం శాఖలో ఉద్యోగినిపై దాడి జరిగిన విషయాన్ని ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న వెంటనే ఆమె నెల్లూరుకు వచ్చి బాధితురాలిని పరామర్శించారు. దాడిచేసిన వ్యక్తిని ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేసిందని, నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారని చెప్పారు. మహిళల పట్ల ఇలా ప్రవర్తించేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు మాట్లాడుతూ ఈ ఘటనపై విచారణ జరపడానికి జేసీ ప్రభాకర్ రెడ్డిని నియమించామని, నివేదిక అందిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సిఐడి డిఎస్పీగా రాంబాబు



గతంలో జిల్లాలో ఎస్ఐగా, సిఐగా, డిఎస్పీగా వివిధ హోదాల్లో పనిచేస్తూ మంచి నిబద్ధత, నిజాయితీ కలిగిన అధికారిగా పేరు తెచ్చుకుని అందరి మన్ననలు అందుకున్న రాంబాబు మళ్ళీ నెల్లూరుకు సిఐడి డిఎస్పీగా వస్తున్నారు. సిఐడి డిఎస్పీగా వివిఎన్ రాంబాబును నియమిస్తూ డిజిపి గౌతంసవాంగ్ తాజాగా ఉత్తర్వులిచ్చారు. కర్నూలు సిఐడి డిఎస్పీగా ఉన్న ఆయన్ను నెల్లూరుకు బదిలీచేశారు. నెల్లూరు పాతదే అయినా కొత్తగా సిఐడి డిఎస్పీగా బాధ్యతలు తీసుకోబోతున్న రాంబాబుకు 'లాయర్' శుభాకాంక్షలు.

## కోవిడ్ నివారణకు చర్యలు తీసుకోండి
**ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీలం సాహ్ని**

రాష్ట్రంలో కరోనా మహమ్మారి వ్యాధి కేసులు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అందరూ ఈ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని, కరోనా నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీలం సాహ్ని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, జేసీ తదితరులతో మాట్లాడుతూ కోవిడ్ ఆసుపత్రుల్లో వైద్యసదుపాయాలు, కోవిడ్ నిర్ధారణ రీక్షలు, ల్యాబ్‌లలో టెస్టింగ్ సామర్థ్యం, మౌలిక వసతులు తదితర విషయాలపై చర్చించారు. జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు మాట్లాడుతూ నెల్లూరులోని నారాయణ ఆసుపత్రి, కిమ్స్, అపోలో, మెడికవర్ తదితర ఆసుపత్రుల ప్రతినిధులతో మాట్లాడి వ్యాధిగ్రస్తులకు అవసరమైన బెడ్స్ పెంచడంతో పాటు, పారా మెడికల్ సిబ్బంది సంఖ్యను కూడా పెంచేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని సిఎస్‌కు చెప్పారు.

## పెట్రో ధరలపై భగ్గు భగ్గు!

పెట్రో ధరల పెంపుదల పట్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న వామపక్ష పార్టీల నాయకులు భగ్గుమన్నారు. కేంద్రం పెట్రోల్ డీజల్ ధరలను అమాంతం పెంచేయడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ధరలు తగ్గించాలని కోరుతూ ఆయా ప్రాంతాల్లోని అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. కోవూరు, పొదలకూరు, బుచ్చి తదితర ప్రాంతాల్లో ఆందోళనలు నిర్వహించారు. నెల్లూరు రూరల్‌లోని పొట్టేపాళెంలో సిపిఎం నాయకులు గతనెల 30న నిరసన వ్యక్తం చేస్తూ గ్రామ సచివాలయాధికారికి వినతిపత్రం సమర్పించారు. సిపిఎం నాయకులు చంద్రమౌళి, ఆలూరు తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.




## డిఎస్పీ విమలకుమారి సేవలు అభినందనీయం
**శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి ప్రశంస**

శ్రీసిటీ డిఎస్పీగా పనిచేస్తూ ఇటీవలే పదోన్నతి పొందిన విమలకుమారిని గతనెల 27న శ్రీసిటి ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. శ్రీసిటీలో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ డిఎస్పీ సేవలను కొనియాడారు. సుమారు రెండున్నర సంవత్సరాలుగా శ్రీసిటీలో డిఎస్పీగా పనిచేసిన విమలకుమారి సేవలు ప్రశంసాత్మకమన్నారు. అనంతరం ఆమెను జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీలోని పలు పరిశ్రమల సిఇఓలు, ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కన్నాభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ సిసిగా రాజశేఖర్

జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు సిసిగా రాజశేఖర్ గతనెల 30న బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ సిసిగా ఉన్న మధు ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో రాజశేఖర్ నియమితులయ్యారు.

## వేగూరు ఉద్యోగ విరమణ
- **ఇన్‌చార్జిగా జె.శ్రీనివాసరావు**



దేవాదాయశాఖ సహాయ కమిషనర్‌గా పనిచేస్తున్న వేగూరు రవీంద్రారెడ్డి ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో మూలాపేటలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం ఇ.ఓ జె.శ్రీనివాసరావును నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. వేగూరు ఉద్యోగ విరమణ సందర్భంగా నెల్లూరులోని ఆర్టీసి బస్టాండ్ వద్ద ఉన్న దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో గత నెల 30న రవీంద్రారెడ్డిని పలువురు సత్కరించారు. విధి నిర్వహణలో ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వేగూరు అందరి మన్ననలు అందుకున్నారని వక్తలు ఈ సందర్భంగా కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఆర్‌జేసి పూర్ణచంద్రరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేవాదాయశాఖలో చిరుద్యోగిగా చేరి ఎంతో క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ సహాయ కమిషనర్ స్థాయికి ఎదిగారని, చేస్తున్న వృత్తికి ఎనలేని గౌరవాన్ని తెచ్చారని వేగూరును కొనియాడారు. ఎలాంటి వివాదాలు లేకుండా అందరినీ సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించారని ఆయన అభినందించారు. విశ్రాంత సహాయ కమిషనర్ ఎన్ యానాదిశెట్టి, మేనేజర్ వెంకటరమణ, దేవాదాయశాఖ నెల్లూరు ఇన్స్‌పెక్టర్ చైతన్య, పలు దేవాలయాల కార్యనిర్వహణాధికారులు పాల్గొని వేగూరు సేవలను ప్రశంసించారు.

### గుండెపోటుతో న్యాయమూర్తి కన్నుమూత..
## తమ్ముడి మరణవార్త తట్టుకోలేక అక్క మృతి

నెల్లూరు నగరంలో మొదటి తరగతి స్పెషల్ మొబైల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న షేక్ అతీఖ్ అహ్మద్(51) గత నెల 28న తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందారు. చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఆయన న్యాయ శాఖలో టైపిస్టుగా ఉద్యోగ జీవితం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. మేజిస్ట్రేట్‌గా కడపజిల్లా పులివెందుల, సిద్ధవరంలో పనిచేసి ఆ తర్వాత నుంచి నెల్లూరులో సేవలందిస్తున్నారు. మంచివ్యక్తిగా, నిక్కచ్చిగా వ్యవహరించే న్యాయమూర్తిగా ఆయనకు పేరుంది. జ్యూడిషియల్ క్వార్టర్స్ వద్ద ఆయన పార్థివదేహానికి పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు నివాళులు అర్పించారు. అనంతరం మృతదేహాన్ని శ్రీకాళహస్తికి తరలించారు. అతీఖ్ అహ్మద్‌కు భార్య, డిగ్రీ చదువుతున్న కుమారుడు ఉన్నారు. న్యాయమూర్తి మృతికి నెల్లూరు బార్ అసోసియేషన్ కమిటి నెల్లూరుజిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం, ఆలిండియా లాయర్స్ యూనియన్, జిల్లాశాఖ నాయకులు సంతాపాన్ని ప్రకటించారు. కాగా, రక్తం పంచుకు పుట్టిన తమ్ముడు గుండెపోటుతో మృతిచెందాడన్న వార్త విన్నవెంటనే షేక్ అతీఖ్‌అహ్మద్ అక్క షాబీరా బేగం(56) కుప్పకూలిపోయి మృతి చెందారు. అక్కాతమ్ముళ్ళ మరణంతో ఇటు నెల్లూరులోనూ, అటు శ్రీకాళహస్తిలోను విషాదఛాయలు అలముకున్నాయి.



ఆషాఢ మాస మంగళవారం సందర్భంగా గత నెల 30న చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరులోని శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న తిరుపతి పార్లమెంటు సభ్యులు బల్లి దుర్గాప్రసాద్‌రావు, కొడవలూరు ధనుంజయరెడ్డి, బల్లి కళ్యాణచక్రవర్తి, పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, దేవాలయ చైర్మెన్ వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి

## గూడూరు డివిజన్ వార్తలు

# ప్రజలను అప్రమత్తం చేయండి

**- సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ**



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ, డిఎస్పీ శ్రీభవాని హర్ష, కమిషనర్ ఓబులేసు

కరోనా నివారణకు అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నామని, ప్రజలు కూడా స్పందించి కరోనా పట్ల అవగాహనతో ఉండాలని, కరోనా నివారణకు తీసుకోవాల్సిన అన్ని ముందుజాగ్రత్తలు తీసుకోవాలని గూడూరు సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ తెలియజేశారు. గూడూరులోని వెలుగు కార్యాలయంలో గత నెల 29న డివిజన్‌లోని పలు శాఖల అధికారులతో ఆయన సమావేశమై కరోనా నివారణ గురించి సమీక్షించారు. కరోనా నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చైతన్యవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ శ్రీభవాని హర్ష, మునిసిపల్ కమిషనర్ ఓబులేసుతో పాటు డిప్యూటి డిఎంహెచ్‌ఓ అచ్యుతకుమారి, సిఐలు దశరధరామారావు, రామకృష్ణారెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# పీవీకి బ్రాహ్మణ సేవాసంఘం నివాళి



ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య గూడూరు శాఖ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ పివి నరసింహారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా సంఘం అధ్యక్షులు వై.చలపతిరావు నివాసంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పివి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

బ్రాహ్మణసేవా సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీకంటి రామ్మోహన్‌రావు, అధ్యక్షుడు వై.చలపతిరావు, ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసులు, కోశాధికారి వై.లలితమ్మ, కమిటీ సభ్యుడు పి.పురుషోత్తం తదితరులు పాల్గొని దేశానికి పీవి చేసిన సేవలను కొనియాడారు. ముఖ్యమంత్రిగా పీవి ఉన్నప్పుడు భూసంస్కరణలు చేపట్టి తన సొంత ఆస్తులు వెయ్యి ఎకరాలను ప్రభుత్వం ద్వారా పేదలకు పంచిపెట్టిన ఘనుడు పీవి అని వారు కొనియాడారు. అదేవిధంగా ప్రధానిగా ఉన్నప్పుడు దేశప్రజల సంక్షేమం కోసం ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేపట్టారని, ఐటి రంగాన్ని అభివృద్ధి చేయడంలో ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. అంతేకాక, 17 భాషల్లో ప్రావీణ్యత కలిగి, 14 భాషల్లో అనేక గ్రంథాలు రాయడం, అనువదించడం ఒక్క పీవీకే చెల్లిందని, అంతటి భాషావేత్త, విజ్ఞానఖని, బహుముఖ ప్రజ్ఞాశాలి పీవికి భారతరత్న ఇవ్వాలని వారు కోరారు.

# అక్రమ ఇసుకదందాను అరికట్టాలి

**- వైకాపా నాయకుల ఆందోళన -**



సబ్ కలెక్టర్ గోపాలకృష్ణతో మాట్లాడుతున్న కోడూరు మీరారెడ్డి

టిడిపి వారి ఇసుక దందాను అరికట్టాలని, ఇసుక అందక పోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని వైకాపా నాయకుడు కోడూరు మీరారెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో గతనెల 29న ఇసుక కోసం నిరసన ధర్నా జరిగింది. ఇసుక అందడం లేదంటూ ట్రాక్టర్ల యజమానులు, వైకాపా కార్యకర్తలు ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేసి సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్‌తో మీరారెడ్డి మాట్లాడుతూ ఇసుక మంజూరుకు ఉన్న వెబ్‌సైట్లు పనిచేయకపోవడంతో అవస్థలు తప్పడం లేదన్నారు. అక్రమంగా తరలిపోతున్న ఇసుకను వెంటనే అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు సుభాన్, శ్రీధర్‌రెడ్డి, రవీంద్రబాబు, కిషోర్‌రెడ్డి, హర్షగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు నిత్యావసరాలు పంపిణీ



గూడూరు గాంధీనగర్‌లో ఉన్న ఇందిరమ్మ కాలనీ 2వ వీధిలో మోజెస్ డే కేర్ సెంటర్ ఆధ్వర్యంలో సిటిడబ్ల్యు మేనేజింగ్ డైరెక్టర్ జాన్ ఓలే బెక్కర్ (జర్మనీ) మరియు హోప్ అండ్ హెల్ప్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ సహాయ సహకారాలతో 67 మంది నిరుపేదలకు 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, న్యాయవాది ప్రతాప్‌కుమార్‌లు పాల్గొని వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ లాక్‌డౌన్ సమయంలో జర్మనీలో ఉంటూ పేదలకు బియ్యం, పలసరుకులు అందిస్తూ, నిరుపేద చిన్నారుల చదువులకు కూడా సహకరిస్తున్న దాత జాన్ ఓలే బెక్కర్‌కు కృతజ్ఞతగా మీ పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలని కోరారు. ఆ దాత సేవలకు అందరూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఊటుకూరు అనిల్ కుమార్, చంద్రలీల, జేవివి సభ్యులు ఓరేపల్లి బాబు, మనోహర్‌గౌడ్, న్యాయవాది పి.ప్రతాప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వికసించిన 'మే' పుష్పం



గూడూరు కోర్టు సెంటర్ రాధాకృష్ణ రెసిడెన్సీలోని నీలకంఠం నీహారిక ఇంటిలో 'మే' పుష్పం వికసించింది. మే మాసంలో వికసించే ఈ పుష్పం ఈ ఏడాది జూన్ మాసాంతంలో వికసించిందని ఆమె తెలిపింది.

# నవోదయకు విద్యార్థుల ఎంపిక



గూడూరు గాంధీనగర్‌లోని లిటిల్‌స్టార్ కోచింగ్ సెంటర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు నవోదయ పాఠశాలలకు ఎంపికైనట్లు కరెస్పాండెంట్ సురేష్‌బాబు చెప్పారు. గత కొన్నేళ్ళుగా పేద విద్యార్థులకు ప్రత్యేకంగా కోచింగ్ అందించి సైనికస్కూల్, నవోదయ, గురుకుల పాఠశాలలకు పంపుతున్నామన్నారు. గత ఏడాది ఇద్దరు విద్యార్థులు సైనికస్కూల్‌కు ఎంపికయ్యారని చెప్పారు. ఈ ఏడాది నెల్‌క్యాస్ట్‌లో పనిచేస్తున్న జి.శివప్రసాద్ కుమారుడు గండికోట విశ్వేశ్వరకుమార్, గుండుబోయిన అమృతేష్, నవోదయ పరీక్షలో రాణించి ఆరవ తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యారని వివరించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు హెచ్‌ఎం రమేష్, సింహపురి విద్యాసంస్థల అధినేత పి.సాయిసురేష్, గండికోట శివప్రసాద్, మోహనకుమారి తదితరులు పాల్గొన్నారు.

### ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో..

# దాతలకు చిరు సత్కారం



కరోనా కష్టకాలంలో లాక్‌డౌన్ నేపథ్యంలో తమ సంస్థ 75 రోజుల పాటు చేసిన సేవాకార్యక్రమాలకు దాతలుగా సహకారం అందించిన 43 మందికి గతనెల 28న జ్ఞాపిక, శాలువలతో చిరుసత్కారం నిర్వహించారు. గూడూరులోని ప్రగతిసేవా సంస్థ వారు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రగతి సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, సహాయ కార్యదర్శి యమహా సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, కార్యవర్గసభ్యులు బాలయ్యనాయుడు, గ్రానైట్ ప్రభాకర్, ప్రజేంద్రరెడ్డి, రామ్మోహన్‌రావు, కరిముల్లా, ఆలీ, సబ్‌రిజిస్ట్రార్ భానుమతి, మునిరాజా, చంద్రశేఖర్‌రెడ్డి, రవి, కోఆర్డినేటర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వైజేపీ లయన్స్ నూతన కార్యవర్గం





2020-21 సంవత్సరానికి గాను వైజేపి లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా నీలకంఠం నవీన్ జయకుమార్, కార్యదర్శిగా బండ్ల సుధాకర్, కోశాధికారిగా పి.వి.శివరామ్‌లను ఎంపిక చేసినట్లు, నూతన కార్యవర్గం వచ్చే నెల 15వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపారు. క్లబ్ నూతన అధ్యక్షులు నీలకంఠం నవీన్ జయకుమార్ మాట్లాడుతూ వైజేపీ లయన్స్ కుటుంబంలో తనకు స్థానం ఇచ్చినందుకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మున్ముందు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. బోర్డు డైరెక్టర్లు మురళీరాజు, ఆర్‌వి రావు మాట్లాడారు. మురళీ నాయుడు, వీ.చంద్రశేఖర్‌రెడ్డి, కె.మంజులాదేవి, వి.వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుట్కాలు, నగదు స్వాధీనం

వెంకటగిరి పట్టణంలోని పలు ప్రాంతాల్లో గూడూరు డీఎస్పీ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గతనెల 29 న దాడులు చేపట్టారు. వెంకటగిరికి చెందిన చాన్‌బాషా, చిత్తూరు జిల్లా తొట్టంబేడు మండలానికి చెందిన సుబ్రహ్మణ్యంలను పట్టుకుని వీరి నుంచి రూ.1.85 లక్షల విలువైన గుట్కాలు, రూ.5.34 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో వెంకటగిరి సీఐ అన్వర్ బాషా, ఎస్సై వెంకటరాజేష్ పాల్గొన్నారు.

## భౌతిక దూరం పాటిద్దాం..

# కరోనాని కట్టడి చేద్దాం..

### - ర్యాలీతో ప్రజలకు అవగాహన కలిగించిన జేసీ ప్రభాకర్‌రెడ్డి




'భౌతిక దూరం పాటిద్దాం.. కరోనాను కట్టడి చేద్దాం'.. అంటూ నినాదాలు చేస్తు వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది గతనెల 29న భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లోని తహశీల్దార్లు, ఎంపిడిఓలు, సచివాలయ సిబ్బంది, వైయస్సార్ క్రాంతి పథం అధికారులు, మండల సమాఖ్య సభ్యులు, వలంటీర్లు అందరూ కలసి ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద జరిగిన ర్యాలీలో గొడుగులతో ర్యాలీ నిర్వహించి మానవహారంగా నిలబడ్డారు. ఈ ర్యాలీలో జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ముందు జాగ్రత్తలు పాటిస్తే కరోనా మహమ్మారి వ్యాధికి దూరంగా ఉండవచ్చని అన్నారు. సామాజిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం, శానిటైజర్లను వినియోగించడం, తరచూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవడం వంటి జాగ్రత్తలను పాటించాలన్నారు. ప్రజలందరూ ప్రభుత్వ సూచనలు పాటించి కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు సహకరించాలని కోరారు. జిల్లాలో ఇప్పటి దాకా 736 కరోనా పాజిటివ్‌కేసులు నమోదు కాగా, అందులో 463 మంది డిశ్చార్జి అయ్యారని, 264 మంది ఐసో లేషన్ కేంద్రాల్లో ఉన్నారని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం విఆర్‌సి సెంటర్‌దాకా గొడుగులతో ర్యాలీని కొనసాగించారు. ఈ ర్యాలీలో కార్పొరేషన్ కమిషనర్ బాపిరెడ్డి, సెట్నెల్ సిఇఓ సుస్మిత, ఐసిడిఎస్ పి.డి సుధా భారతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజనులకు అన్ని వసతులు కల్పిస్తాం

**- కాకాణి**

గిరిజన కుటుంబాలు నివసించే ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేకదృష్టి పెడుతున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గత నెల 28న వెంకటాచలం మండలంలోని అనికేపల్లి పంచాయితీలోని రామాపురం, కాశీ నగరం, నాగులవరం గిరిజన కాలనీల్లో ఎమ్మెల్యే కాకాణి పర్యటించారు. గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన కుటుంబాలు నివసించే ప్రాంతాల్లో పర్యటించి వారికి అవసరమైన వసతులను కల్పిస్తామన్నారు. ఎంపిడివో ఎ.సరళ, తహశీల్దార్ ఐఎస్ ప్రసాద్, వైసిపి నాయకులు కోడూరు ప్రదీప్‌కుమార్ రెడ్డి, మండల వెంకటేశయ్య, నంబూరి రాజానాయుడు, అలగల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పి.వి.నరసింహారావుకు 'భారతరత్న' ఇవ్వాలి

మాజీ ప్రధానమంత్రి దివంగత పి.వి.నరసింహారావుకి 'భారతరత్న' ఇవ్వాలని రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య ఉపాధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి గుడ్లదొన వాసుదేవరావు, ఇసుకపల్లి కామేశ్వరరావు డిమాండ్ చేశారు. నెల్లూరుజిల్లా విడవలూరులోని కోదండరామస్వామి ఆలయంలో గత నెల 28న పి.వి.నరసింహారావు శతజయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కొడవలూరు, విడవలూరు మండల బ్రాహ్మణ సమాఖ్య నాయకులు శ్రీనివాసులు, శ్రీకాంత్ శర్మ, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

# పొగాకు రైతులను ఆదుకుంటాం

- మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్ళకు ఏర్పాట్లు
- కేంద్ర పొగాకుబోర్డు రీజనల్ మేనేజర్ వెల్లడి

జిల్లాలోని పొగాకు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చొరవ తీసుకోవడంతో, సిఎం సూచనల మేరకు మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోళ్ళు చేసేందుకు సంబంధిత అధికారులు సమాయత్తమయ్యారు. జిల్లాలోని మర్రిపాడు మండలం డిసి పల్లిలోని పొగాకు బోర్డు వేలం కేంద్రాన్ని సందర్శించడానికి గతనెల 27న విచ్చేసిన కేంద్ర పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ సుధాకర్ రావు మాట్లాడుతూ పొగాకు రైతులను ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. కరోనా నివారణ చర్యల్లో భాగంగా వేలం కేంద్రానికి వచ్చే రైతులు మాస్కులు ధరించాలని, వేలం జరిగేంతవరకు బయటే ఉండి, వేలం అనంతరమే రైతులు లోపలికి రావాలని ఆయన సూచించారు. అనంతరం జరిగిన వేలంలో 460 పొగాకు బేళ్ళను విక్రయించారు. వేలంలో మొత్తం 56,633 కిలోల పొగాకు అమ్ముడవగా కిలోకి గరిష్టధర 198, కనిష్టధర 80 రూపాయల వంతున లభించింది. ఈ వేలంలో 9 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు. ఈనెల 30న సుధాకర్‌రావు పదవీ విరమణ పొందనుండడంతో ఈ సందర్భంగా రైతులు, రైతు నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఇన్‌ఛార్జి వేలం నిర్వాహణాధికారి గిరిరాజ్‌కుమార్, రైతు సంఘం నాయకులు నరసప్పనాయుడు, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంగళ రెడ్డి, విశ్వేశ్వరరావు, జనార్దన్ పాల్గొన్నారు.

# నిమ్మరైతుకు కడగండ్లు



దేశ స్థాయిలో నిమ్మ ధరలను శాసించే ఢిల్లీ మార్కెట్లు కరోనా ప్రభావంతో డీలాపడడంతో నిమ్మరైతుకు కడగండ్లు ఎదురయ్యాయి. గత ఏడాది ఈ సీజన్లో బస్తా నిమ్మ కాయలు రూ.7 వేల వరకు విక్రయించగా, ప్రస్తుతం రూ. 600 మించి అమ్మే పరిస్థితి లేకుండాపోయింది. దక్షిణాది రాష్ట్రాలైన చెన్నై, బెంగుళూరు, కేరళ ప్రాంతాల మార్కెట్లు కరోనా ప్రభావంతో మూసివేశారు. దీంతో నిమ్మకాయలు బయటకు వెళ్ళే మార్గం లేక రైతులు తోటల్లోని చెట్లకే కాయలను వదిలేస్తున్నారు. దీంతో కాయలు పండిపోయి రాలిపోతున్నాయి. గత నెల 28న పొదలకూరు నిమ్మ మార్కెట్లో లూజు బస్తా ధర రూ.400 నిమ్మకాయల బస్తాకు కోత కూలీలు రూ.150 నుంచి రూ. 200 వరకు ఖర్చవుతోంది, రవాణా ఛార్జీ రూ.50, కమిషన్ రూ. 40 పోతే రైతు చేతికొచ్చేది రూ.110 మాత్రమే. దీంతో నిమ్మరైతులు కుదేలవుతున్నారు.

# భక్తవరదుడు..శ్రీరంగనాధుడు

***నెల్లూరులోని శ్రీరంగనాధుని క్షేత్రం.. ఉత్తర శ్రీరంగంగా, 109వ వైష్ణవ క్షేత్రంగా ప్రసిద్ధి. క్షీర సాగరంలో శ్రీమహావిష్ణువు శేషపాన్పుపై పవళించినట్లుగానే ఇక్కడ కూడా రంగనాధుడు అదేవిధంగా దర్శనమిస్తాడు. అందుకే స్వామివారిని 'పళ్ళికొండ పెరుమాళ్ళు' అంటే 'శయన రంగనాధుడు' అని పిలుస్తుంటారు.***






ఇక్కడ వెలసివున్న శ్రీ రంగనాధస్వామి విష్ణువు రూపంగా, రంగనాయకి అమ్మవారు లక్ష్మీదేవికి ప్రతిరూపంగా పురాణాలు పేర్కొంటున్నాయి. పూర్వకాలంలో ఇక్కడ పెన్నానది రెండుపాయలుగా చీలి అంతర్వేదిగా ఏర్పడి ఉండేది. సంతపేట ప్రాంతం నుంచి నది ఎంతో వెడల్పుగా విశాలంగా ఉండేది. అప్పట్లో పెన్నానది మధ్యలో ఉన్న ఈ ఆలయాన్ని దర్శించుకోవాలంటే పెన్నను దాటుకుని రావాల్సిందే. అందుకే 'పెన్న దాటితే పెరుమాళ్ళ సేవ' అనే నానుడి ఏర్పడింది.

**ఆలయ చరిత్ర :**

క్షీరసాగర శయనుడైన శ్రీమన్నారాయణుడు బాహ్యాలోక విహారార్థియై ఆదిశేషుని క్రీడాశైలంగా అవతరించమని ఆజ్ఞాపించగా పావన పినాకినీ తీరంలో శేషుడు గిరిగా అవతరించాడని, శ్రీమన్నారాయణుని పాదస్పర్శతో పునీతమైన ఆ గిరియే తల్పగిరిగా అవతరించిందని పురాణ ప్రశస్తి. ఆ తర్వాతి కాలంలో కశ్యపమహర్షి పెన్నానది తీరంలో పౌండరీకయాగం చేశాడని, అందులోంచి ప్రభవించిన త్రేతాగ్నుల్లోంచి ఆదినారాయణుడే ఉద్భవించి ఆ మహర్షి కోరిక మేరకు ఇక్కడ శ్రీ రంగనాధస్వామిగా పేరొందారని స్కంధపురాణంలోని తల్పగిరి క్షేత్ర మహాత్మ్యం వివరిస్తోంది. నాటి నుంచి ఇది శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాధస్వామి ఆలయంగా పేరొందినట్లు చరిత్ర. పూర్వకాలంలో జనమేజయుడు ఈ ఆలయానికి దివ్యమైన గోపురం కూడా నిర్మించాడని, కాలక్రమేణా అది శిథిలమైపోయిందని ప్రాచీన చరిత్ర. ఈ ఆలయం సమీపంలోనే ఉన్న పెన్నానది ఒడ్డున మహాకవి తిక్కన భారతాన్ని ఆంధ్రీకరించిన మందిరం కూడా నేటికీ ఉంది. మౌర్యులు, చోళులు, పల్లవులు ఇలా ఎందరో రాజులు ఈ సీమను పాలించిన రోజుల్లో ఈ ఆలయం ఎంతో వైభవంగా ఉండేది. మనుమ సిద్ధి రాజు కాలానికి, అంటే క్రీ.శ 1280 నాటికి కూడా రంగనాధస్వామి ఆలయం ఎంతో వైభవంతో ఉండేదని చరిత్ర పేర్కొంటోంది.

**సింహపురికే మకుటాయమానం..**
**ఏడంతస్తుల రాజగోపురం :**

రంగనాయకస్వామి భక్తుడైన యరగుడిపాటి వెంకటాచలం పంతులు ఈ ఆలయానికి అత్యద్భుతమైన రీతిలో ఏడంతస్తుల రాజగోపురాన్ని నిర్మించడం ఎంతో అపురూపమైన విషయం. శ్రీరంగనాధుని సేవకే జీవితాన్ని అంకితం చేసిన యరగుడిపాటి వారు సింహపురిసీమకే మకుటాయమానంగా 1859లో ఈ ఆలయానికి ఏడంతస్తుల రాజగోపురం నిర్మించారు. 95 అడుగుల ఎత్తు ఉన్న ఈ రాజగోపురం పైభాగాన బంగారు పూత పూసిన ఏడు కలశాలు ఆలయ వైభవానికి చిహ్నంగా స్వర్ణకాంతులతో ధగ ధగలాడుతుంటాయి.

**అపురూపమైన అద్దాల మండపం..**
**ఆళ్వార్ల మందిరాలు :**

ఆలయ ప్రాంగణానికి తూర్పువైపున రాజగోపురం ఉంది. ప్రధాన ఆలయం పశ్చిమాభిముఖంగా ఉంటుంది. గర్భాలయంలో శేషతల్పంపై శయనముద్రలో శ్రీ రంగనాధుడు నయన మనోహరంగా దర్శనమిస్తాడు. స్వామివారి పాదాల వద్ద శ్రీదేవి భూదేవి కొలువుదీరి ఉంటారు. ఒకవైపు.. అందరినీ చల్లగా కాపాడే శ్రీ రంగనాయకి తల్లి మందిరం, అత్యద్భుతమైన రీతిలో అనేక చిత్రాలతో అద్వితీయంగా రూపొందించిన అద్దాల మండపం, అందులో పైభాగాన మర్రాకుపై పవళించి ఉన్న చిన్నికృష్ణుడు... మనం ఎటువైపు నుంచి చూసినా మనల్నే చూస్తున్నట్లుండే మనోహరమైన చిన్నికృష్ణుని చిత్రం.. ఇవన్నీ చూసి తీరాల్సిందే. మరోవైపు గోదాదేవి మందిరం, ఆళ్వార్ల మండపాలు, వెనుకనే పెన్నానది గలగలలు.. ఆలయ ప్రాంగణంలో ఇటీవల నిర్మించిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం అన్నీ కూడా భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

**ఇసకేస్తే రాలని..**
**రంగడి తిరునాళ్ళు :**

రంగడి తిరునాళ్ళంటే ఇసకేస్తే రాలనంతగా భక్తజనం తరలి వస్తుంటారు. ఏడాదికోసారి బ్రహ్మోత్సవాలు ఇక్కడ బ్రహ్మాండంగా జరుగుతుంటాయి. లక్షలాదిమంది భక్తులు ఈ తిరునాళ్ళకు తరలి వస్తారు. అందులోనూ రంగడి తేరు రోజున జరిగే రథోత్సవాన్ని చూసి తరించేందుకు విచ్చేసే భక్తజనులతో రంగనాయకులపేట జనసముద్రంగా మారిపోతుంటుంది.

వీక్షణం
- మంజీర

## ఇండియా బజార్
# కొందామా! వద్దా?

ఇది ఒకప్పటి చైనా బజార్ కాదు. ఇప్పుడిది ఇండియా బజార్. హైదరాబాద్, పంజాగుట్టలోని హైదరాబాద్ సెంట్రల్ దాటి కొద్దిగా ముందుకు వెళ్తే అదే వరసలో 'చైనా బజార్' పేరుతో ఓ షాప్ కనిపించేది. ఇప్పుడు అదే రోడ్‌లో ప్రయాణిస్తుంటే పాత బోర్డుల వరసలో ఓ కొత్త బోర్డు చూపరుల దృష్టిని ఆకర్షిస్తోంది. చూపు తిప్పుకోనివ్వకుండా ఓ క్షణం మన దృష్టి పథాన్ని నిర్దేశిస్తున్నది ఆ బోర్డు కొత్తగా మెరుస్తూ ఉండడం కాదు, బోర్డు మీదున్న 'ఇండియా బజార్' అనే పేరు. ఈ ఇండియా బజార్‌లో అన్నీ ఇండియాలో తయారైన వస్తువులనే అమ్ముతారా? బహుశా... ఇంతకంటే అమాయకమైన సందేహం మరొకటి ఉండకపోవచ్చు. దేశం లాక్‌డౌన్‌లోకి వెళ్లక ముందు వచ్చిన స్టాక్ అది. దేశం కోవిడ్ 19 నుంచి అన్‌లాక్ అయ్యే నాటికి బోర్డు మారిపోయింది. ఈ బోర్డు మారడానికి కారణం లాక్‌డౌన్ – అన్‌లాక్‌ల మధ్య కాలంలో సంభవించిన టీ కప్పులో తుఫానే.

### సరిహద్దు సంఘర్షణ

గల్వాన్ లోయలో భారత భూభాగంలోకి చైనా దళాలు చొచ్చుకుని రావడం, ఆ నేపథ్యంలో తలెత్తిన సంఘర్షణలో మన సైన్యం ఇరవై మంది ప్రాణాలు కోల్పోవడం భారత్ గుండెని పిండేసింది. భారతీయుల రక్తం మరిగిపోయింది. చైనాకు అడ్డుకట్ట వేయడానికి కంకణం కట్టుకుంది భారతీయత. చైనా వస్తువులను కొనడానికి వీల్లేదు. మన డబ్బుతో సుసంపన్నమైన చైనా మనమీదనే కాలు దువ్వుతోంది. ఈ అరాచకాన్ని సహించేది లేదంటూ ఒక నిశ్శబ్ద యుద్ధం దేశంలో మొదలైపోయింది కూడా. ఇదే సమయంలో మనదేశంలో చైనాకు కష్టం కలిగితే ఇండియాలో తమ ఛాతీకి మలామ్ రాసుకునే అభ్యుదయవాదులూ ఉన్నారు. ఈ రెండు భావజాలాల మధ్య డిజిటల్ ఇండియా దేశభక్త భారతం – అభ్యుదయ భారతంగా చీలిపోయింది. దేశభక్త భారతం భావోద్వేగాలను విశ్లేషించే పనిలోపడింది అభ్యుదయ భారతం. చైనా ఉత్పత్తులను కొనవద్దనే పిలుపును జాతీయోద్యమ కాలం నాటి 'విదేశీ వస్తు బహిష్కరణ – స్వదేశీ ఉద్యమం'గా చిత్రీకరించే ప్రయత్నమూ చేస్తోంది. నిజానికి ఈ పోలిక ఏ మాత్రం పొసగదు. అప్పుడు... అంటే... జాతీయోద్యమ కాలంలో మనం బ్రిటిష్ వలస పాలకుల పాలనలో ఉన్నాం. ఆ పాలన పట్ల నిరసనగా దాదాభాయ్ నౌరోజీ, గాంధీజీ వంటి ప్రముఖులు విదేశీ వస్తువుల బహిష్కరణకు పిలుపునిచ్చారు. తమ నిరసన తీవ్రత పాలకులకు తెలియడానికి విదేశీ వస్తువులను తగులబెట్టారు. అయితే... ఇప్పుడు జరుగుతున్న చైనా వస్తువులను కొనవద్దనే పిలుపు స్వదేశీ పాలనకు మద్దతుగా మాత్రమే కాదు, ఈ నిరసన నిశ్శబ్దంగా అమలు చేయదగినది కూడా.

### ఇదో మేధోమార్గం

ఒక మేధోవర్గం... 'జాతీయోద్యమంలో చేసినట్లు ఇప్పుడు మీరు మీ చేతిలో ఉన్న చైనా ఫోన్‌ని తగుల బెట్టేస్తారా, మీ ఇంట్లో ఉన్న ఎల్ఈడీ టీవీని పగులకొట్టేస్తారా, మీరు కొన్న ప్లాస్టిక్ స్టూల్‌ని బయట పారేస్తారా, దోమల బ్యాట్‌ను వాడడం మానేస్తారా' అని సర్కాస్టిక్‌గా ప్రశ్నిస్తోంది. అలాగే... 'మనం చైనా ఉత్పత్తులను కొనడం మానేస్తే మొదట నష్టపోయేది మన దగ్గర చైనా ఉత్పత్తుల దుకాణం పెట్టిన వ్యాపారి కదా? మన వ్యాపారికి నష్టం వచ్చే పని చేయడం న్యాయమేనా' అంటూ మరో వైపు నుంచి భావోద్వేగాలను ప్రభావితం చేసే ప్రయత్నమూ జరుగుతోంది. అందుకు మధ్యేమార్గంగా వెలిసిందే పైన చెప్పుకున్న 'ఇండియా బజార్'. ఇప్పటికే దిగుమతి చేసుకున్న స్టాక్‌ను డబ్బు చేసుకోవడానికి ఈ మార్గాన్ని వెతుక్కున్నాడు ఆ దుకాణదారుడు. చైనా ఉత్పత్తులను కొనడం మీద విముఖత మనదేశంలో ఇదే స్థాయిలో కొనసాగితే, ఇకపై ఆ దుకాణదారుడు భారతీయ పరిశ్రమలు తయారుచేసిన ఉత్పత్తులతోనే వ్యాపారం చేస్తాడు కదా!

### మన పరిశ్రమల మీద వేటు

మన దగ్గర ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ఎంతో మంది చిన్న చిన్న పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. ఎక్కువమంది ఎమ్ఎస్ఎమ్ఈ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ యాక్ట్, 2006 కింద రిజిస్టర్ అయిన పరిశ్రమలు) కింద నమోదైన వాళ్లే. వారికి ప్రభుత్వం తరఫు నుంచి పరిశ్రమ నిలదొక్కుకోవడానికి అవసరమైన ప్రోత్సాహకాలు ఉంటున్నాయి. కానీ ఉత్పత్తిని మార్కెట్ చేసుకోవడంలోనే ఇబ్బందులు పడుతున్నారు. వాళ్లకు అతి పెద్ద ప్రతిబంధకం చైనా ఉత్పత్తులే. బ్రేక్ ఈవెన్ రాక మూత పడుతున్న పరిశ్రమల్లో ఎక్కువ శాతం చైనా నుంచి దిగుమతి అయ్యే నాసిరకం వస్తువుల మార్కెట్‌ను తట్టుకోలేకనే. మనవాళ్లు గట్టిగా మన్నికగా ఉండి, వంద కిలోల బరువు మనిషి కూర్చున్నా కూడా కదలని ప్లాస్టిక్ స్టూళ్లను, కుర్చీలను తయారుచేస్తున్నారు. వాటి ధరలో సగం ధరకే పలుచని చైనా స్టూళ్లు, కుర్చీలు మార్కెట్‌లో సవాల్ చేస్తుంటాయి. ఎవరికి వాళ్లు 'మనకు ఇప్పటికి ఇవి సరిపోతాయిలే'అని రాజీ పడుతూ చైనా వస్తువులనే కొనడం జరిగింది ఇన్నాళ్లు. ఈ రాజీలు అల్పాదాయ వర్గాలు, దిగువ మధ్య తరగతిలోనే ఎక్కువ. అలాగని సంపన్నులు రాజీ పడడం లేదా అంటే... వాళ్లు కూడా పెద్ద పెద్ద కొనుగోళ్లలో చైనాకే దాసోహమంటున్నారు. చైనా ఫర్నిచర్‌ను లోడ్‌ల కొద్దీ దిగుమతి చేసుకుంది నియోరిచ్ వర్గం. బడా కాంట్రాక్టర్‌లు కూడా నిర్మాణరంగంలో చైనా యంత్రాలనే ఆశ్రయిస్తున్నారు.

### ప్రత్యామ్నాయం ఉంది

అంతర్జాతీయ ట్రేడ్ ఒప్పందాల నిబంధనల ప్రకారం చైనా ఉత్పత్తులను మన ప్రభుత్వం అధికారికంగా నిరాకరించలేదు. అలాగని జనం అనధికారికంగా నిరాకరిస్తే ప్రభుత్వాలు ఏమీ చేయలేవు. కాగల కార్యం గంధర్వులే నిర్వహించేశారని సంతోషించడం తప్ప. ఇప్పటికే కొన్న వాటిని తగలబెడితే నష్టపోయేది మనమే. ఎందుకంటే ఆ వస్తువుల మీద లాభం ఇప్పటికే చైనా జేబులోకి చేరిపోయింది. చైనా మీద కోపంతో మనం మన చెమటతో సంపాదించిన డబ్బు పెట్టి కొన్న... మనవైపోయిన మన వస్తువులను వృథా చేసుకోమని కాదు అర్థం. ఇకపై కొనేటప్పుడు ఇది చైనాది కాదు కదా అని ఓసారి బార్‌కోడ్‌ను చూసుకుంటే చాలు. బార్‌కోడ్‌లో మొదటి మూడు అంకెలు 690 నుంచి 699 వరకు ఉంటే ఆ వస్తువును కొనేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తే చాలు. ఎందుకంటే మరీ మొండిగా నిషేధం విధించుకోవడం కూడా అన్ని వేళలా సాధ్యం కాదు. ఇది ఎలాగంటే మన ఊరిలో ఒకే ఒక్క పచారీ కొట్టు ఉందనుకోండి. ఆ పచారీ కొట్టు యజమాని మీద మనకు ఎంత కోపం ఉన్నా సరే... ఆ కొట్టులో వస్తువులను కొనక తప్పదు. ఎవరైనా ముందుకు వచ్చి ఊర్లో మరో పచారీ కొట్టు పెట్టే వరకు లేదా మనమే సొంత పచారీ కొట్టు పెట్టే వరకు మనకు నచ్చని కొట్టులోనే కొనక తప్పని పరిస్థితి ఉంటుంది. ఇప్పుడు చైనా ఉత్పత్తుల మీద స్వీయ నిషేధమూ అంతే. అయితే మన పరిశ్రమలు పరిపుష్టం కావడానికి ఇదొక మంచి పరిణామం. కాబట్టి విజ్ఞతతో కొనుగోలు చేద్దాం.

## కలెక్టరేట్ ఉద్యోగులకు
# వర్క్ ఫ్రం హోమ్

కరోనా పుణ్యం అంటూ నెల్లూరులోని కలెక్టరేట్ ఉద్యోగులకు కరోనా పాజిటివ్ రావడంతో అధికారులు ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోమ్ ప్రకటించారు. కరోనాతో అప్రమత్తమైన అధికారులు 90 మంది ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో కూడా కొంతమందికి కరోనా పాజిటివ్ రావడంతో అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు.

## సోమశిల ప్రాజెక్ట్
# ఎస్ఈగా కృష్ణారావు

సోమశిల ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా కృష్ణారావు ఈనెల1న నెల్లూరు దర్గామిట్టలోని సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం ప్రాజెక్ట్ ఎస్ఈగా పనిచేస్తున్న కృష్ణారావును ప్రభుత్వం నెల్లూరుకు బదిలీ చేసింది.

## దివ్యాంగురాలిపై
# దాడి బాధాకరం

- చిలక ప్రవీణ్



నెల్లూరులోని ఏపి టూరిజంలో దాడికి గురైన దివ్యాంగురాలిని హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏపి వైస్ ప్రెసిడెంట్ చిలక ప్రవీణ్‌కుమార్ ఇటీవల పరామర్శించారు. మహిళలపై ఇలాంటి దాడులు జరగకుండా చూడాలని, సభ్య సమాజం తలదించుకునే విధంగా ఒక అధికారి విచక్షణారహితంగా దివ్యాంగు రాలిపై దాడిచేయడం హేయమైన చర్య అని పేర్కొంటూ, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# సీపీఎల్ భూములను పరిశీలించిన కలెక్టర్

ముత్తుకూరు మండలం కృష్ణపట్నం గ్రామ సమీపంలోని కోస్టల్ ఆంధ్రా పవర్ లిమిటెడ్ (సీఏపీఎల్) భూములను జిల్లా కలెక్టర్ యంవి శేషగిరిబాబు ఈనెల 1న పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సీఏపీఎల్ కంపెనీ పదేళ్ళ కిందట తీసుకున్న భూములపై ప్రభుత్వం నివేదికలు కోరిందని, పూర్తి వివరాలు పంపాలని తహశీల్దార్ సోమ్లా నాయక్‌ను ఆదేశించారు. ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఏపీఐఐసీ జోనల్ చంద్రశేఖర్, సర్వే ఏ.డి.హనుమాప్రసాద్, వీఆర్వో అవినాష్ తదితరులు పాల్గొనారు.

## మానవత్వమా...
# నీ మనుగడెక్కడ!..



- తాళ్లూరి శ్రీనివాస్

మానవత్వమా నీ మనుగడెక్కడ !
సమానత్వమా నీ చప్పుడెక్కడ !
సోదర భావమా నీ ఛాయలెక్కడ !
జన హృదయ ఘోషా నీ జాడెక్కడ !

ఓ పక్క కరోనా కాటేస్తున్నా
మరోపక్క మిడతల దండు మాటేస్తున్నా
వన్య ప్రాణి విలపిస్తున్నా
జంతు ప్రాణి జ్వలిస్తున్నా
మానవాళిని కబళిస్తున్నా ....

అతివలపై ఆగడాలు అనునిత్యం
అబలలపై అకృత్యం నిత్య కృత్యం
దివ్యాంగులపై దాడుల దృశ్యం
అనుదినం ఆత్మహత్యా సదృశ్యం ....

మానవత్వమే మరీచికైన వేళ
వికృత క్రీడల వీచికలో
రక్తపు మరకల మాసికలు ....

నీతి బాహ్యపు చర్యలు నిలుచుటెపుడు !
నిజంగా న్యాయం గెలుచుటెపుడు !
ధర్మాన్ని వరించి ధరణి తరించుటెపుడు !
మనిషి మనీషిగా మారి మురిపించుటెపుడు!



చార్టర్డ్ అకౌంటెంట్స్ డే సందర్భంగా ఈ నెల 1వ తేదీన గూడూరుకు చెందిన ప్రముఖ సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావును సన్మానిస్తున్న గూడూరు వాసవి క్లబ్ ప్రతినిధులు



డాక్టర్స్ డే సందర్భంగా ఈ నెల 1వ తేదీ బుధవారం డాక్టర్ సి.రోహిణి, డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డిలను సన్మానిస్తున్న గూడూరు రోటరీ క్లబ్ ప్రతినిధులు.

# 831కి చేరిన బాధితులు

- జిల్లాలో ఉధృతంగా కోవిడ్ వైరస్
- ప్రతిరోజూ నమోదవుతున్న కొత్త కేసులు
- ఒకేరోజున నెల్లూరులో 9 మందికి కరోనా

జిల్లాలో కరోనా మహమ్మారి వ్యాధి జోరుగా వ్యాపిస్తూనే ఉంది. ఈ ప్రాణాంతక వైరస్ సోకి ప్రతిరోజూ పలువురు ఆసుపత్రుల పాలవుతూనే ఉన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఎంతో కట్టుదిట్టంగా నియమ నిబంధనలు అమలుచేస్తున్నా, ఆసుపత్రుల్లో వైద్యులు ఎందరో కరోనా బాధితులు ప్రాణాలు కోల్పోకుండా అహరహం శ్రమిస్తూనే ఉన్నా జిల్లాలో రోజురోజుకీ వ్యాధిగ్రస్తులు పెరిగిపోతూనే ఉండడం విచారకరం. ఈనెల 1న బుధవారం ఒక్కరోజే జిల్లాలో 12 మంది కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయంటే ఈ వ్యాధి ఎంతగా విజృంభిస్తోందో తేటతెల్లమవుతూనే ఉంది. ఈనెల 1వ తేది నాటికి జిల్లాలో కరోనా బాధితుల సంఖ్య 831కి చేరింది. వీటిలో తాజాగా ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడులో ఒకటి, విడవలూరు మండలంలోని పార్లపల్లిలో ఒకటి, చిల్లకూరు మండలం చింతవరంలో ఒకటి వంతున కేసులు నమోదయ్యాయి.

### నెల్లూరు నగరంలో మరింత ఉధృతి...

నెల్లూరు నగరంలో కరోనా వ్యాధి మరింత ఉధృతంగా వ్యాపిస్తూనే ఉంది. ముఖ్యంగా ప్రజలు మాస్క్‌లను నామమాత్రంగా ధరిస్తుండడం, భౌతికదూరం పాటించకుండా ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా ఉండడం వంటి చర్యలు కరోనా వ్యాప్తికి దోహదం చేస్తున్నాయి. ఈ వ్యాధితో ఇప్పటికి జిల్లాకు చెందిన 11 మంది, ఇతర జిల్లాలకు చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఈనెల 1న నగరంలోని సంతపేటలో ఒకరికి, హరనాథపురంలో ముగ్గురికి, చిల్డ్రన్స్ పార్క్ దగ్గర ఒకరికి, మనుమసిద్ధినగర్‌లో ఒకరికి, ఏసీనగర్‌లో ఒకరికి, నవాబ్‌పేటలో ఒకరికి కరోనా సోకడంతో వారిని పెద్దాసుపత్రి, నారాయణ ఆసుపత్రుల్లోని ఐసోలేషన్ వార్డులకు తరలించారు. ఇప్పటిదాకా నమోదైన 831 కేసుల్లో 509 మంది దశలవారీగా కోలుకున్నారు. మరో 310 మంది ఐసోలేషన్ వార్డుల్లో చికిత్సలు పొందుతున్నారు. వీరితో కాంటాక్ట్ అయిన 254 మందిని క్వారంటైన్ సెంటర్లలో ఉంచి వైద్యపరీక్షలు చేయిస్తున్నారు. కరోనా వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉంటూ, వ్యాధి తమ దాకా రాకుండా ఎవరికి వారు ప్రభుత్వం సూచించిన కట్టుదిట్టమైన ముందుజాగ్రత్తలు తీసుకోవడం ఎంతైనా ఉత్తమం!...

# కరోనా పట్ల.. అలక్ష్యం వద్దు

**- ప్రధాని మోడీ**



***దేశంలో 'అన్‌లాక్' దశ ప్రారంభమైన తర్వాత ప్రజల్లో నిర్లక్ష్యం పెరిగింది. వ్యక్తిగత సామాజిక వ్యవహార శైలిలో నిర్లక్ష్యం కనిపిస్తోందంటూ ప్రధాని మోడీ ఎంతో ఆందోళన వ్యక్తం చేశారు. గతనెల 30న ప్రధాని జాతి నుద్దేశించి ప్రసంగిస్తూ లాక్‌డౌన్ సమయంలో ప్రజలు చూపిన జాగ్రత్త ఇప్పుడు చూపడం లేదని, కరోనా మహమ్మారి వ్యాధి పట్ల ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని, అలక్ష్యం వద్దనే వద్దని స్పష్టం చేశారు.***

మాస్క్ ధరించడం, భౌతికదూరం పాటించడం వంటి నియమాలను ఖచ్చితంగా పాటించాలని ప్రధాని గట్టిగా హెచ్చరించారు. మాస్క్ ధరించకుండా బయటకువెళ్ళిన ఓ దేశ ప్రధానికి అక్కడి అధికారులు 13వేల రూపాయలు జరిమానా విధించారని, అదేవిధంగా భారత్ లోనూ స్థానిక ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని, గ్రామ సర్పంచ్ నుంచి ప్రధాని వరకూ ఎవరూ నిబంధనలకు అతీతులేమీ కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, ముఖ్యంగా కంటోన్మెంట్ జోన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సరైన సమయంలో లాక్‌డౌన్ ప్రకటించడం, లాక్‌డౌన్ నిబంధనలను ఖచ్చితంగా అమలుచేయడం తదితర కారణాలతో లక్షలాదిమంది ప్రాణాలను కాపాడగలిగామని అన్నారు. కరోనా వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేయాల్సి ఉందన్నారు. కరోనా మహమ్మారిపై పోరులో ఇతర దేశాలతో పోలిస్తే భారత్ మెరుగైన ఫలితాలు సాధించిందని, అయితే, కోవిడ్ వైరస్ ముప్పు ఇంకా తొలగిపోలేదని, గతంలో కంటే మరింత జాగ్రత్తగా ఉండాల్సిన ఈ తరుణంలో ఎలాంటి నిర్లక్ష్యం మంచిది కాదని ప్రధాని వివరించారు.

### ఒకే దేశం..ఒకే రేషన్‌కార్డ్

దేశవ్యాప్తంగా ఒకే రేషన్‌కార్డు విని యోగమయ్యే దిశగా చర్యలు ప్రారంభించినట్లు ప్రధాని మోడీ ఈ సందర్భంగా చెప్పారు. సొంతూళ్ళను వదిలి ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్ళేవారికి దీనివల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. లాక్‌డౌన్ ప్రకటించాక పేదలకు 1.75 లక్షల కోట్ల ప్యాకేజీ ప్రకటించామని, అందులో 31 వేల కోట్లను 20 కోట్ల మంది పేదల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జతచేశామని, 9 కోట్ల మంది రైతులకు 18వేల కోట్లు అందించామని వివరించారు. గ్రామాల్లో ఉపాధి కార్యక్రమాలకు మరో 50వేల కోట్లను ఖర్చుచేస్తున్నామన్నారు.

### నవంబరు వరకు ఉచిత రేషన్ :

కరోనా మహమ్మారి వ్యాధి ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని దేశంలోని 80 కోట్ల మంది నిరుపేదలకు నవంబరు నెలాఖరు వరకు ఉచితంగా ఆహారధాన్యాలు, పప్పు దినుసులు ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రధాని తెలిపారు. దీనికోసం కేంద్రం 90వేల కోట్లు ఖర్చుచేయనుందన్నారు. రానున్న పండుగ రోజుల్లో దేశంలోని ఏ నిరుపేద కూడా ఖాళీ కడుపుతో ఉండకూడదన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రధాని వివరించారు.

# తిరుమలేశునికి 5 టన్నుల వేరుశెనగ పప్పు

**- శ్రీవారికి మొక్కు తీర్చుకున్న పేర్నాటి**



వైసిపి రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి ఈ నెల 2వ తేదీ గురువారం తిరుమలేశునికి 5 టన్నుల వేరు శెనగపప్పుని కానుకగా సమర్పించుకున్నాడు. సేంద్రీయ పద్ధతిలో తాను పండించే పొలంలో మంచి దిగుబడి వస్తే కొంత స్వామి వారికి సమర్పించుకుంటానని తిరుమలేశునికి మొక్కుకున్నాడు. ఆయన ఆశించినట్లే మంచి దిగుబడి రావడంతో 5టన్నుల వేరుశెనగ పప్పును శ్రీవారికి కానుకగా టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డికి అందజేశారు.

# ఫేస్‌బుక్ వేదికగా 'నారాయణతీర్థుల తరంగాలు'



కరోనా, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో ఈ ఏడాది నారాయణతీర్థుల వారి 345వ జయంతిని ఫేస్‌బుక్ వేదికగా ఔత్సాహికులు జరుపుకున్నారని, యువతీ యువకుల్లో శ్రీకృష్ణ లీలాతరంగాల ప్రాముఖ్యతను గురించి అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమం చేపట్టారని, ఇది ఫేస్‌బుక్ వేదికగా చేసిన తొలి ప్రయత్నమని నెల్లూరులోని శ్రీకృష్ణ లీలాతరంగ ప్రచారసమితి ప్రతినిధి, ప్రముఖ గాయని రాళ్ళపల్లి సుబ్బులక్ష్మి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనేకమంది సంగీతకళాకారులు పాల్గొని వారి శిష్యులచే నారాయణతీర్థ తరంగాలు గానం చేయించారని ఆమె పేర్కొన్నారు.

### రామలింగాపురం కూడలి వద్ద...

# ఫ్లై ఓవర్ బ్రిడ్జికి సన్నాహాలు

ఎన్నోఏళ్ళుగా నెల్లూరు ప్రజలు ఎదురుచూస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి కల నిజం కాబోతోంది. నెల్లూరు నగరంలో ట్రాఫిక్ జామ్ సమస్యను తగ్గించేందుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కృషి ఫలితమే ఈ బ్రిడ్జి నిర్మాణానికి నాంది పలికింది. నెల్లూరు జిల్లా ఎంపీల సహకారంతో నగరంలో ప్రధాన రోడ్డుగా వున్న మినీబైపాస్‌లోని రామలింగాపురం కూడలి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి గతనెల 29న ప్రాథమిక పనులు చేపట్టారు. ఇందుకోసం దాదాపు రూ.42 కోట్లు ఖర్చుకాగల అంచనాలతో టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేసినట్లు సమాచారం.

# పథకాల పండుగ

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ నేతలు కూడా కక్కుర్తి పడుతుండడంతో నిరుద్యోగ యువకులు అప్పు చేసి మరీ డబ్బులు ఇచ్చి ఆ ఉద్యోగాలు పొందేవారు. అయితే ఇలాంటి అవినీతిని అరికట్టి టాలెంట్, రిజర్వేషన్లతో ఈ ప్రక్రియ చేపడితే నిరుద్యోగులకు మేలు కలుగుతుందని భావించిన జగన్ ప్రభుత్వం ఒక కార్పొరేషన్ను నియమించి దాని ద్వారానే నియామకాలను చేపట్టి ప్రభుత్వమే నేరుగా జీతాలిచ్చే ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఈరోజు (జులై 3వ తేదీ) జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించబోతున్నాడు.

### ఇక రాబోయే రోజుల్లో...

జులై 8న రాజన్న71వ జయంతి సందర్భంగా 30 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ, జూలై 29న రైతులకు వడ్డీ లేని రుణాలు, ఆగస్టు 3న వైఎస్సార్ విద్యా కానుక, ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆర్వోఎఫ్ఆర్ పట్టాల పంపిణీ, ఆగస్టు 12న వైఎస్సార్ చేయూత పథకం కింద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రూ.18,750 కోట్లు అందజేత, ఆగస్టు 19న వైఎస్సార్ వసతి దీవెన కింద పిల్లల తల్లులకు రూ.10వేల చొప్పున వారి అకౌంట్లలోకి నేరుగా తొలి విడత చేయూత అందజేత, ఆగస్టు 26న 15 లక్షల వైఎస్సార్ ఇళ్ల నిర్మాణం ప్రారంభం, సెప్టెంబర్ 11న వైఎస్సార్ ఆసరాకి అంకురార్పణ, సెప్టెంబర్ 25న వైఎస్సార్ విద్యా దీవెన కింద ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల, అక్టోబర్‌లో రైతు భరోసా రెండో విడత సాయం, నవంబర్‌లో రెండో విడత విద్యాదీవెన, డిసెంబర్‌లో అగ్రిగోల్డ్ బాధితులకు సాయం, వచ్చే ఏడాది జనవరిలో మళ్ళీ అమ్మ ఒడి కార్యక్రమం, రైతు భరోసా చివరి విడత సాయం, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విద్యా దీవెన మూడో దఫా సాయం మార్చిలో పొదుపు సంఘాలకు వడ్డీలేని రుణాలు...

ఇలా తాను చెప్పింది చెప్పినట్లుగా చేసి చూపించడమే లక్ష్యంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, మాట తప్పని మడమ తిప్పని రాజన్న బిడ్డగా, ప్రజలు తనమీద పెట్టుకున్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని వమ్ము కానీయకుండా తన అడుగులు వేస్తున్నాడు.

### జులై 1న...

### 1088 కొత్త 104 , 108 వాహనాలు ప్రారంభం

మొన్న బుధవారం జులై ఒకటోతేదీన ప్రపంచ డాక్టర్స్ డే సందర్భంగా ఒకేసారి 1088 కొత్త 104 ,108 వాహనాలకు విజయవాడలోని బెంజి సర్కిల్‌లో జెండా వూపి ఆంధ్రుల సేవ కోసం అంకితం చేశాడు జగన్. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఏపీ చరిత్రలో చెప్పుకోదగ్గ రోజుల్లో ఈరోజు ఒకటి, డాక్టర్స్ డే సందర్భంగా కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ సెంటర్‌ను కూడా ఇవాళే ప్రారంభిస్తున్నాం, ఇలాంటి సెంటర్ ప్రభుత్వ వ్యవస్థలో ఉండడం ఇదే మొదటిసారి.

మెడికల్, సర్జికల్, రేడియోథెరపీ విభాగాలన్నీ ఇందులో ఉన్నాయి, ఈ సదుపాయం ఆధారంగా మొదటిసారి ప్రభుత్వ కాలేజీల్లో రేడియో థెరపీకి సంబంధించిన సీట్లనుకూడా తీసుకురాగలిగాం, ఏఈఆర్‌బీ అప్రూవల్ ఉన్న మొదటి సెంటర్ కూడా ఇదే. కర్నూలులో కూడా ఇలాంటి సెంటర్ ఒకటి నిర్మిస్తున్నాం, ఇది చాలా మంచి పరిణామం అన్నారు.

ఈరోజు ఉదయాన్నే 1088 కొత్త 104, 108 అంబులెన్స్‌లు ప్రారంభోత్సవం చేశాం, అవి జిల్లాలకు వెళ్తూ ఉంటే... మనసుకు చాలా ఆనందం కలిగింది, ఇంత అధునాతన అంబులెన్స్‌లు ఇంత పెద్దసంఖ్యలో ఒకేరోజు పంపించడం చరిత్రలో సువర్ణాధ్యయం. ఇంత భారీ సంఖ్యలో అంబులెన్స్‌లు పంపడం ఒక ఘనతైతే, పసిపిల్లలకోసం ప్రత్యేకంగా అంబులెన్స్‌లు ఏర్పాటు చేయటం, వాటిలో పసిపిల్లల ప్రాణాలు కాపాడ్డంకోసం ప్రత్యేకంగా జిల్లాకు 2 చొప్పున నియోనాటల్ అంబులెన్స్‌లు కావడం శుభపరిణామం... అంటూ భవిష్యత్తులో ప్రజల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం తీసుకోనున్న అన్ని చర్యలగురించి వివరిస్తుంటే ఆయన ముఖంలో ఒక సంతృప్తి ప్రజలకి ఇంకా ఏదో చెయ్యాలన్న తపన స్పష్టంగా కనిపించాయి.

ఒక వైపు మద్యపానాన్ని సంపూర్ణంగా నిషేధించే విధంగా అడుగులు వేస్తూనే, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసే దిశగా ప్రయత్నాలు సాగిస్తూ, ఇంకో వైపు ప్రజల అవసరాలను తీర్చడానికి కావలసిన సంక్షేమ పథకాల గురించి ఆలోచిస్తూ, ఆంధ్రాను పాలిస్తున్న తొలి యువ ముఖ్యమంత్రిగా జగన్ తనదైన ముద్రను వేసుకుంటున్నాడు. కరోనా లాంటి కష్టకాలంలో కూడా ఎక్కడా తడబడడంలేదు. మేధావులకు సైతం అంతుపట్టని విధంగా ఆర్థిక పరిస్థితులను సమన్వయం చేస్తూ ఎక్కడా ప్రజలకు లోటు రానీయకుండా చూస్తున్నాడు. తాను చెప్పిన రాజన్న రాజ్యం దిశగా తన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఒక్కొక్క అడుగూ వేసుకుంటూ వెళ్తున్నాడు. వైయస్ రాజశేఖర రెడ్డికి అసలైన వారసుడిగా ప్రజా మన్ననలను అందుకుంటున్నాడు. తొలి ఏకాదశి రోజునుండే ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి తండ్రికి తగ్గ తనయుడిగా రాష్ట్రంలో పథకాల పండుగలను పెద్దఎత్తున జరుపబోతున్నాడు.

## భావితరాలకు స్ఫూర్తి..

# మన.. పాములపర్తి



### • శత జయంతి సందర్భంగా మాజీ ప్రధాని పీవీని స్మరించుకున్న భారతావని

*ఎవరైనా సరే, పుట్టుకతో కాదు.. వారు చేసే కృషి వల్లే గొప్పవారవుతారన్నది పెద్దల మాట. కృషినే నమ్ముకుని నిరంతర పరిశ్రమతో, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అందుకునేవారు నిజంగా రుషులే. అలాంటి రాజకీయ రుషి..తెలుగువారి సమున్నత కీర్తి..భావితరాలకు స్ఫూర్తి.. మన పాములపర్తి వారు. పివి నరసింహారావుగానే కాక పీవీగా.. భారతదేశానికే ఒక ఠీవిగా రాణించిన మహోన్నత నాయకుడాయన. ఢిల్లీ పీఠమెక్కిన తొలి దక్షిణాది నాయకుడు, అందులోనూ మన తెలుగువాడు, అపరచాణుక్యుడు పాములపర్తి వెంకట నరసింహారావు. ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి, ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలు అపారం.. అమూల్యం. ముఖ్యంగా ఆయన చేపట్టిన ఆర్థిక సంస్కరణలు.. సాహసోపేత నిర్ణయాలు దేశానికి మేలుబాటలు వేశాయి. ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ ఆయన ఎన్నో ప్రజాసంక్షేమ పథకాలను అమలుచేసి రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఘనకీర్తిని పొందారు. ప్రజలందరి ప్రశంసలు అందుకున్నారు. ఆయన సేవలు సదా స్మరణీయం..చిరస్మరణీయం!...*

**దేశంలో ఆర్థిక సంస్కరణలకు పీవీ నరసింహారావే ఆద్యులు. దేశం ఆర్థికంగా కోలుకోవడానికి ఆయన మార్గం చూపారు.**

**- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంస**

**దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉన్నప్పుడు పీవి నరసింహారావు ప్రధానిగా నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. దేశానికి ఆయన సేవలు మరచిపోలేనివి.**

**- ప్రధాని నరేంద్ర మోడీ**

జూన్ 28న భారత మాజీప్రధాని పివి నరసింహారావు శతజయంతి సందర్భంగా భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధాని మోడీ పీవీ సేవలను కొనియాడుతూ ఆయనకు ఘన నివాళు లర్పించారు. పదిహేడేళ్ళ వయసులోనే నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన ధైర్యశాలి పీవి అని ప్రధాని మోడీ కొనియాడారు. పీవీ బహుభాషా కోవిదుడు, ఎన్నో దేశ విదేశీ భాషల్లో మాట్లాడగలరు. ఒకవైపు భారతీయ మూలవిలువలకు సంపూర్ణంగా కట్టుబడివుంటూనే మరోవైపు అంతర్జాతీయ సాహిత్య విజ్ఞానాలు సముపార్జించారు. ఆయనో గొప్ప రచయిత. కృషితో అత్యున్నత శిఖరాలకు ఎదిగారు అని పీవీని ప్రధాని మోడీ ప్రశంసించారు.

### అంగరంగ వైభవంగా పీవీ శతజయంతి వేడుకలు :

గతనెల 28న భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు శతజయంతి ఉత్సవాలను ఎంతో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పీవికి ఘననివాళులర్పించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సంజీవయ్య పార్కులో అత్యంత వైభవంగా జరిగిన ఈ వేడుకలు పీవీ మహోన్నత వ్యక్తిత్వాన్ని మరింతగా దీప్తివంతం చేశాయి. ఈ కార్యక్రమంలో కెసిఆర్ మాట్లాడుతూ పీవీ గొప్ప సంస్కరణశీలి అనీ, ఏ రంగంలో కాలు పెడితే ఆ రంగంలో సంస్కరణలు తెచ్చారని కొనియాడారు. పీవీ నవభారత నిర్మాతల్లో ఒకరని, ఆయన అభ్యుదయవాది, సంస్కరణవాది అని కొనియాడుతూ పీవీకి భారతరత్న ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేస్తామని చెప్పడంతో అందరి నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. అంతేకాదు, పీవీ స్వస్థలమైన వంగర గ్రామంలో పీవీ నివసించిన పురాతన భవనం పక్కనే ఒక కొత్త భవనం నిర్మించి అందులో ఆయన ఉపయోగించిన వస్తువులు, పుస్తకాలు వగైరాలన్నిటినీ భద్రపరచి మ్యూజియంగా ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా పీవీ శతజయంతి ఉత్సవాల విశేషాలు ప్రపంచవ్యాప్తంగా అందరికీ తెలిసేలా ఏర్పాట్లు చేయడం ఎంతైనా సంతోషదాయకం. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ పీవీకి ఈ సందర్భంగా నివాళులర్పిస్తూ పీవీ బహుభాషా కోవిదుడని, దేశాన్ని ఆయన సరళీకృత ఆర్థికవిధానాల వైపు నడిపించారని, ఆయన చేసిన కృషి తరతరాలకూ చిరస్మరణీయంగా ఉంటుందని ప్రశంసించారు. ఇవన్నీ కూడా పీవి వ్యక్తిత్వానికి, మచ్చలేని నాయకత్వానికి, అత్యద్భుతమైన ఆయన సంస్కరణల విధానానికి, అంతులేని భాషా వైదుష్యానికి, బహుముఖీనమైన సారస్వత వైభవానికి నిదర్శనాలేనని వేరే చెప్పనక్కర లేదు. ఆంధ్రరాష్ట్రంలోనూ ఈ సందర్భంగా పీవీ శతజయంతిని పురస్కరించుకుని ఎన్నో చోట్ల కార్యక్రమాలు జరిగాయి. నాయకులు, ప్రజలందరూ పీవీ సేవలను గుర్తుచేసుకుని, దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఘననివాళులర్పించారు.

### దొరతనాన్ని కూడా వదులుకుని యోగిలా జీవించాడు :

సాధారణంగా చెప్పేదొకటి.. చేసేదొకటి అన్నట్లుండే అనేకమంది నాయకులకు... పీవీకి పోలికే లేదు. చెప్పింది చేయడమే ఆయనకు తెలిసింది. నీతి నిజాయితీలతో జీవించడం.. నిగర్వంగా ఉండడం, ఎంత తెలిసినా ఏమీ తెలియనట్లుండడం ఆయన నైజం. కృషినే నమ్ముకున్న రుషి ఆయన. భోగభాగ్యాలపై ఆయనకు ఆసక్తి లేదు. ఒక యోగిలా జీవించడంలో ఉన్న ఆనందమే ఆయనకు అంతులేని సంతృప్తిని కలిగించేది. అందుకే స్వతహాగా పిత్రార్జితంగా వచ్చిన బోలెడంత ఆస్తిని, ఆ తర్వాత దత్తత పోవడం ద్వారా ఇంకా వచ్చిన వందల ఎకరాల ఆస్తిని హాయిగా అనుభవిస్తూ దర్జాగా బతకాల్సిన పీవీ ఆ ఆస్తులతో పాటే వచ్చిన దొరతనాన్ని కూడా వదులుకుని యోగిలా జీవించాడు. వాస్తవానికి పన్నెండు వందల ఎకరాల ఆసామి అయినప్పటికీ, తాను ముఖ్యమంత్రి కాగానే రాష్ట్రంలో భూ సంస్కరణలు అమలుచేసి, పరిమితికి మించి ఉన్న తన భూమినంతా పేదలకు పంచిపెట్టేశారు.

### ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని గట్టెక్కించారు :

రాజకీయరంగంలోనూ పీవి తన ప్రత్యేకతను చాటుకునేవారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ఒంటరిగానే పోరాడేవారు. ధీశక్తితో అనుకున్న లక్ష్యాన్ని సాధించేవారు. 1991 జూన్21న పీవి ప్రధాని అయ్యారు. అప్పటికి దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉంది. దేశం దాదాపు దివాళా తీసే పరిస్థితులున్న ఆ కాలంలో పీవి తీసుకున్న అనేకానేక సాహసోపేతమైన నిర్ణయాలు మళ్ళీ దేశాన్ని ఆర్థికంగా నిలదొక్కుకునేలా పరిపుష్టం చేశాయి. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని మలుపుతిప్పిన ఆ ఘనతంతా పీవీదే. ఈ సందర్భంగా దేశంలో ఎదురైన ఎన్నో భారీ సవాళ్ళను ధీటుగా ఎదుర్కొన్నారు. మంచి వ్యక్తిత్వం.. నిరాడంబర తత్వంతో పాటు అపారమైన విజ్ఞానంతో ఆయన ప్రపంచస్థాయి అత్యున్నత మేధావుల్లో, అగ్రశ్రేణి నాయకుల్లో ఒకరయ్యారు. తాను ఏ పదవిలో ఉన్నా ఆ పదవికే వన్నె తెచ్చారు. భారతదేశ గౌరవాన్ని, ఘనకీర్తిని ఇనుమడింపజేశారు. ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డనేనంటూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను స్మరించుకుంటూ, జన్మభూమిని గౌరవిస్తూ.. అకుంఠిత దేశభక్తితో దేశానికి అనితరసాధ్యమైన సేవలందించి మహోన్నత నాయకునిగా, ఆదర్శనేతగా రాణిస్తూ దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా అందరి అభినందనలు అందుకున్నారు. భరతజాతికే గర్వకారణంగా నిలిచారు. ఆయన జీవితం భావితరాలకు మార్గదర్శకం.. తరతరాలకూ ఎంతో స్ఫూర్తిదాయకం!..

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: roopagroup@yahoo.com